అన్నవరం.. కార్తిక సంరంభం



అన్నవరం, న్యూస్‌టుడే : పవిత్ర కార్తికమాసం సందర్భంగా నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు అన్నవరం దేవస్థానంలో పలు ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. వైదిక కార్యక్రమాల వివరాలను అధికారులు వెల్లడించారు.

సత్యదీక్షా కాలం : ఈనెల 27 నుంచి సత్యదీక్షలు ప్రారంభమవుతాయి. నవంబరు 23 వరకు 27 రోజుల దీక్ష, నవంబరు 6 నుంచి 18 రోజుల దీక్ష, నవంబరు 14 నుంచి 9 రోజుల దీక్ష చేపట్టనున్నారు.

ఆకాశ దీపం ప్రారంభం : నవంబరు 1న ఆకాశ దీపం ప్రారంభంతో కార్తికమాస ఉత్సవాలు ప్రారంభిస్తారు.

తెప్పోత్సవం : 13వ తేదీన సత్యదేవుని తెప్పోత్సవం జరగనుంది. ఉదయం 8 గంటలకు సత్యజ్యోతిని ఊరేగిస్తారు. రాత్రి 7 గంటలకు కొండ దిగువన పంపా సరోవరంలో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహిస్తారు.

గిరిప్రదక్షిణ, పంపా హారతులు : నవంబరు 15న సత్యదేవుని గిరిప్రదక్షిణ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథం ప్రారంభమవుతుంది. సాయంత్రం 5.30 గంటలకు కొండ దిగువన పంపా సరోవరం చెంతనే పంపా హారతుల కార్యక్రమం ఉంటుంది. రాత్రి 7 గంటలకు తొలిపావంచాల వద్ద జ్వాలా తోరణం నిర్వహిస్తారు.

పడిపూజ : అదేనెల 22న కొండపై వార్షిక కల్యాణ వేదిక వద్ద సాయంత్రం 6 గంటలకు పడిపూజ ఉంటుంది.

సత్యదీక్ష విరమణ : 23న తెల్లవారుజామున 3 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు అనంతరం సత్యదీక్ష విరమణ చేస్తారు.

జ్యోతిర్లింగార్చన : 29న సాయంత్రం 6 గంటలకు అనివేటి మండపంలో జ్యోతిర్లింగార్చన ఉంటుంది.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు. ఉదయం 11గంటలకు గండేపల్లి మండలం మురారిలోని రైతు సేవా కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు దేవులనాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ హాజరుకానున్నారు. జిల్లాలో 277 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని లక్ష్యంగా చేసుకున్నారు.



ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం

జీవో 117 రద్దు నిర్ణయంపై సర్వత్రా హర్షం

న్యూస్‌టుడే, పామర్రు

విద్య పునర్ వ్యవస్థీకరణ పేరిట వైకాపా సర్కారు తెచ్చిన జీవో 117తో విద్యా రంగం కుదేలైంది. సర్కారు అనాలోచిత చర్యలతో ముఖ్యంగా ప్రాథమిక విద్య విధ్వంసానికి గురైంది. ప్రాథమిక పాఠశాలలు కళావిహీనంగా మారాయి. ఈ పరిస్థితి చక్కదిద్దేలా ఉపాధ్యాయ సంఘాలు, విద్యారంగ అభిలాషుల వినతి మేరకు కూటమి సర్కారు చర్యలు చేపట్టడంతో అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

10+2 విద్యా విధానం స్థానంలో 5+3+3+4 విద్యావిధానాన్ని (ఎన్‌ఈపీ) తీసుకొచ్చింది. దీనికోసం వైకాపా సర్కారు జీవో 117తో 3, 4, 5 తరగతులను విలీన ప్రక్రియ చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో 368 పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే మిగిలిపోయాయి. 3, 4, 5 తరగతులవారు ఉన్నత పాఠశాలలకు వెళ్లలేని దూరాభారంతో ఇబ్బందిపడ్డారు. సుమారు 910 మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా మిగిలిపోయారు. 3, 4, 5 తరగతుల వారికి స్కూల్ అసిస్టెంట్లతో బోధన చేయిస్తామని వైకాపా సర్కారు ప్రగల్భాలు పలికింది. ఉమ్మడి జిల్లాలో 1,215 వరకు టీచర్ల సర్దుబాటు చేయాల్సి వచ్చింది. దీంతో గందరగోళం తలెత్తింది. ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బడుల సంఖ్య బాగా పెరిగిపోయింది.

● విలీనంతో ఎన్నో అవస్థలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 368 ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గత సర్కారు విలీనం చేసింది. దీనివల్ల సుమారు 911 పాఠశాలల్లో పది మందిలోపే విద్యార్థులు మిగిలారు. 126 పాఠశాలల్లో ఒక్కో తరగతిలో ఒక్కరూ చేరలేదు. సున్నా సంఖ్య ఉన్న పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో 15 వరకు ఉన్నాయి.

● ఇచ్చిన హామీ నెరవేర్చి..

అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 117 రద్దు చేస్తామని కూటమి నాయకులు హామీఇచ్చారు. చెప్పినట్టే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఈ జీవోను వచ్చే విద్యాసంవత్సరం నుంచి రద్దు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

● ఇదీ ప్రయోజనం

◆ జీవో 117 రద్దుతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుంది. ◆ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయ నియామకానికి జీవో 53 అమలవుతుంది. ◆ 98 మంది కంటే తక్కువ ఉన్న ఉన్నత పాఠశాలలకు జీవం వస్తుంది. ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టువారీ ఉపాధ్యాయులు వస్తారు.

డీఎస్సీ ఖాళీలు భర్తీ అవుతాయి



రాష్ట్రంలో మెగా డీఎస్సీ ప్రకటించారు. సుమారు 17 వేల పైబడి రాష్ట్రంలో, 1215 పోస్టులు ఉమ్మడి జిల్లాలోనూ భర్తీ చేస్తామన్నారు. 117 జీవో రద్దు చేస్తే ఖాళీలు భర్తీ అవుతాయి.

- చింతాడ ప్రదీప్‌కుమార్, పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి, కాకినాడ



వేంకటేశ్వరస్వామి శేషవాహన సేవలో భక్తులు





కళాకారుల డప్పు వాయిద్యం

కాంతులీనుతున్న వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం

వెంకన్న బ్రహ్మోత్సవం.. భక్తజన సంబరం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: గోవింద నామస్మరణలు మిన్నంటిన వేళ వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అంకురార్పణ చేశారు. శుభముహూర్తంలో ధ్వజారోహణ నిర్వహించారు. గరుడ పటాన్ని ఊరేగించి బ్రహ్మాది దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి సమక్షంలో ఎగురవేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు తదితరులు మూలమూర్తికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏడు పడగల ఆదిశేషనిపై రాత్రి ఉభయ దేవేరులతో పరావాసుదేవ అలంకారంలో స్వామి ఊరేగారు. ● మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, సరస్వతి అలంకరణలో హంసవాహన సేవ ఉంటాయి.

కస్టమ్స్ సూపరింటెండెంట్ సస్పెన్షన్

ఈనాడు, కాకినాడ: లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన కాకినాడ పోర్టులోని కస్టమ్స్ హౌస్ సూపరింటెండెంట్ వై.శ్రీనివాసులును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈనెల 5న కాకినాడ కస్టమ్స్ కార్యాలయంలో సీబీఐ అధికారులు దాడిచేసి సూపరింటెండెంట్ శ్రీనివాసులు నుంచి రూ.3.18 లక్షలు.. అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా సహాయ కమిషనర్ ఎం.శ్రీనివాస్ దగ్గర రూ.22.74 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో శ్రీనివాసులుతోపాటు.. శ్రీచంద్ర బల్క్ కార్గో ప్రతినిధి భరత్‌కుమార్‌ను సీబీఐ అధికారులు అరెస్టుచేసి అప్పట్లో రిమాండ్‌కు పంపారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ప్రాథమిక చర్యల్లో భాగంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, సూపరింటెండెంట్లు వై.శ్రీనివాసులు, ప్రదీప్‌కుమార్, ఇ.శ్రీనివాస్‌లను విజయవాడలోని కస్టమ్స్ కేంద్ర కార్యాలయానికి బదిలీ చేశారు. విశాఖపట్నం సీబీఐ కార్యాలయం నుంచి అందిన నివేదిక ఆధారంగా సూపరింటెండెంట్‌ను ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి సస్పెండ్ చేశారు. మిగిలిన అధికారుల నుంచీ వివరణ కోరినట్లు తెలుస్తోంది. కాకినాడ కస్టమ్స్ హౌస్‌లోని అవినీతి బాగోతం బయటపడడంతో కీలక విభాగం ప్రతిష్ఠ దిగజారింది. దీంతో శాఖాపరమైన చర్యల విషయాలేవీ బయటకు పొక్కకుండా యంత్రాంగం గోప్యంగా ఉంచింది. బదిలీలు, చర్యలతో కాకినాడ కస్టమ్స్ హౌస్‌లో ఖాళీ అయిన స్థానాల్లో పూర్తిస్థాయి నియామకాలు ఇంకా జరగలేదు. అక్కడి ఉద్యోగులకే ప్రస్తుతానికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

సాగునీటి సంఘాలకు పచ్చజెండా

ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, ముమ్మిడివరం, పి.గన్నవరం: అయిదేళ్ల వైకాపా పాలనలో గాలికొదిలేసిన సాగునీటి పారుదల వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా ఆయకట్టు పరిధిలో కాలువల నిర్వహణ, ఇతర బాధ్యతల పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించే సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారని జలవనరులశాఖ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో గోదావరి డెల్టా సిస్టమ్, ఏలేరు ఇరిగేషన్ (వైఐ) డివిజన్, ఏలేరు ప్రాజెక్టు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీం, పంపా రిజర్వాయర్, సుబ్బారెడ్డి సాగర్, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 401 సాగునీటి సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ), 5 ప్రాజెక్టు కమిటీలు (పీసీ) ఉన్నాయి.

ప్రక్రియ ఇలా..

కాలువల ఆయకట్టు ఆధారంగా ప్రాదేశిక (టెరిటోరియల్) నియోజకవర్గాల వారీ ఆయకట్టు నిర్ధారణ, ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి.. 12 టీసీలను ఎన్నుకుంటారు. వీరిలోనే సాగునీటి వినియోగదారుల సంఘానికి (డబ్ల్యుయూఏ) అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటారు. డబ్ల్యుయూఏలు డీసీలు (డిస్ట్రిబ్యూటరీ కమిటీ), డీసీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. గతంలో గోదావరి డెల్టా పరిధిలో ఒకటే ప్రాజెక్టు కమిటీ ఉండేది. ప్రస్తుతం తూర్పు, మధ్య డెల్టాలకు వేర్వేరుగా కమిటీల ఎన్నిక జరగనుంది.

గోదావరి డెల్టా సిస్టమ్ (జీడీఓస్):	▶ మధ్య డెల్టాలో సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యుయూఏ): 56
తూర్పు డెల్టా :	▶ 74 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ): 25 ▶ ప్రాజెక్టు కమిటీలు: 2
ఏలేరు ప్రాజెక్టు :	▶ సంఘాలు: 25 ▶ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు: 5 ▶ ప్రాజెక్టు కమిటీ: 1
తొర్రిగడ్డ పంపింగ్ పథకం :	▶ వినియోగదారుల సంఘాలు: 04 ▶ ప్రాజెక్టు కమిటీ: 01
పంపా రిజర్వాయర్ :	▶ సంఘాలు: 06 ▶ ప్రాజెక్టు కమిటీ: 01
సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు :	▶ సంఘాలు: 06 ▶ ప్రాజెక్టు కమిటీ: 01
సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థ :	▶ సంఘాలు: 216 ఏలేరు నీటిపారుదల డివిజన్ (పెద్దాపురం): ▶ సంఘాలు: 14

అధికారుల నియామకానికి చర్యలు

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి మండలానికి డిప్యూటీ తహసీల్దార్లు అధీకృత అధికారులుగా వ్యవహరిస్తారు. ఎన్నికల అధికారులుగా జలవనరులశాఖ ఇంజినీర్లను నియమించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులుగా సచివాలయ సిబ్బంది ఉంటారు. ధవళేశ్వరం సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతే రాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: సమాజ భద్రతకోసం సాయుధ దళాలు, పోలీసు సిబ్బంది అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారని, విధి నిర్వహణలో అసువులు బాసినవారి త్యాగాలు మరువలేనివని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా కాకినాడ పాత జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్తూపం వద్ద కలెక్టర్‌తోపాటు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు చినరాజప్ప, నెహ్రూ, ఏఎస్పీలు భాస్కరరావు, శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం పరేడ్ నిర్వహించారు. మరణించిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 వేల చొప్పున 13 మందికి చెక్‌లు అందజేశారు. వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖకు ప్రజలందరూ సహకారం అందించాలన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ దేశంకోసం సరిహద్దుల్లోనే కాకుండా దేశం లోపలకూడా సాయుధ బలగాలు, పోలీసులు సేవలందిస్తున్నారన్నారు. డీఎస్పీలు రఘువీర్‌విష్ణు, కె.శ్రీహరిరాజు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్సీ పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప నివాళి

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఇందుకు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికకు నవంబరు 3న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని రూ.2.50 లక్షల వార్షిక ఆదాయం కలిగిన ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీదారుల వేదన.. ఆదుకుంటేనే సాంత్వన

కాకినాడ కలెక్టరేట్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సమస్యలు విన్నవించుకునేందుకు పోటీపడటంతో కాకినాడలోని కలెక్టరేట్ కిటకిటలాడింది. సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా, శిక్షణ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డీఆర్వో తిప్పేనాయక్, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ ఉదయం 10 గంటల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కరించాలని, రీ-సర్వేలో కొంత భూమి తగ్గించేశారని, వీల్‌ఛైర్లు, పింఛన్లు ఇప్పించాలని, జనావాసాలు, ఆలయాల సమీపంలో మద్యం దుకాణాలు పెట్టొద్దని, తప్పుడు వైద్యం చేసిన ఆర్‌ఎంపీ వైద్యుడిపై చర్యలు చేపట్టాలని, సర్వీసులు క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని ఏకంగా 438 మంది ప్రజలు, ఉద్యోగులు, దివ్యాంగులు వినతులు అందజేశారు. ఒకే సమస్యపై అనేక సార్లు అర్జీలు ఇచ్చినా.. సమస్యలు పరిష్కరించడంలేదని కొంత మంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ వినతుల స్వీకరణకు అందుబాటులో లేకపోవడంతో మరికొందరు నిరాశకు గురయ్యారు. జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు వారాలకోసారి జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని, ప్రతి శనివారం కలెక్టర్ ఆధ్వర్యంలో అర్జీల ప్రగతిపై సమీక్షిస్తున్నారని, అధికారులు నిర్లిప్త ధోరణి వీడకపోతే ఇబ్బందిపడతారని హాజరైన జిల్లా స్థాయి అధికారులను హెచ్చరించారు.



కార్యక్రమానికి వచ్చిన ప్రజలు

రసీదుకు తప్పని నిరీక్షణ

వేదికలో అర్జీ ఇవ్వడం ఒక ఎత్తయితే.. దానికి రసీదు పొందడం నరక ప్రాయంగా మారుతోంది. ఉదయం 10 గంటలకే వినతి అందజేసినా.. సిబ్బంది అర్జీదారుకు రసీదు ఇచ్చేందుకు గంటల సమయం పడుతోంది. రసీదు జారీ అంశాన్ని సరళతరం చేయాలని ప్రజలు కోరుతున్నారు. సుమారు 70 కి.మీ. దూరం నుంచి ఇక్కడకు వస్తున్నామని, తిరిగి ఇంటికి వెళ్లేసరికి చీకటి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు తప్పని ఇక్కట్లు

ఇక్కడికి వచ్చే దివ్యాంగులు వీల్‌ఛైర్లు అందుబాటులో లేక ఇబ్బందిపడుతున్నారు. సోమవారం పలువురు ఇలాగే యాతనపడిన విషయం తెలుసుకున్న సిబ్బంది అప్పటికప్పుడు కలెక్టరేట్‌లో ఒక చోట భద్రపర్చిన వీల్‌ఛైర్లను తీసుకువచ్చి దివ్యాంగులను అధికారుల వద్దకు తీసుకువెళ్లారు. దాంతో వారు తమ సమస్యలు వివరించే వీలు కల్పించారు.

ఎస్పీ కార్యాలయంలో..

కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సమక్షంలో జరిగిన కార్యక్రమానికి 56 మంది ఫిర్యాదులు ఇచ్చారు. సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనివారు స్థానిక పోలీసు స్టేషన్లు, సర్కిల్, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు. ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి వేడుకను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ, శాస్త్రవేత్త ముక్తేశ్వర్‌ప్రసాద్

మెరుగైన జీవనానికి మేలైన ఆహారం

గాంధీనగర్, న్యూస్‌టుడే: మానవ జీవితంలో ఆహారం అనేది అత్యంత అవసరమైందని, ఆహారంతోనే జీవన మనుగడ సాగుతుందని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ పేర్కొన్నారు. వర్సిటీ అలుమ్ని ఆడిటోరియంలో సోమవారం జేఎన్‌టీయూకే స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, అసోసియేషన్ ఫర్ సైంటిస్ట్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ ఇండియా కాకినాడ చాప్టర్ ఆధ్వర్యంలో మెరుగైన జీవితం, మంచి భవిష్యత్తుకోసం ఆహారం హక్కు పేరుతో ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మురళీకృష్ణ, విశిష్ట అతిథిగా విశాఖలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ ఎమిరిటస్ సైంటిస్టు ఎం.ముక్తేశ్వర్‌ప్రసాద్, అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఫుడ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. నూతన ఆవిష్కరణలపై పరిశోధన చేయాలని సూచించారు. రాష్ట్ర విభజన తరువాత ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని వసతులు కలిగిన ప్రయోగశాల ఇక్కడే ఉందని, సద్వినియోగం చేసుకుంటే బాగుంటుందన్నారు. ముక్తేశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవితంలో 36 టన్నుల ఆహారం తీసుకుంటారన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులందించారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ఎం.రమేష్, ఐక్యూఏసీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 74 మంది గైర్హాజరు

సాంబమూర్తినగర్: కాకినాడ జిల్లాలో సోమవారం రెండు కేంద్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించారు. ఐయాన్ డిజిటల్ జోన్ సాఫ్ట్ టెక్నాలజీస్ కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్ష జరిగింది. 672 మందికిగాను 598 మంది పరీక్ష రాశారు. 74 మంది గైర్హాజరైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.

ఒక్కటి ఆగినా.. వాహనదారికి యాతన



ఎండలో అవస్థలు పడుతున్న వాహనదారులు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: సామర్లకోటలోని కాకినాడ కెనాల్‌రోడ్డులో సోమవారం గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. అడుగు దూరం కూడా ముందుకు కదిలే అవకాశం లేక ప్రయాణికులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వి.కె.రాయపురం మాధవపట్నం గ్రామాల మధ్యలో ప్రయివేటు కళాశాలకు చెందిన ఓ బస్సు సాంకేతిక లోపంతో రోడ్డుపై అడ్డుగా ఆగిపోయింది. బస్సుకు ఇరువైపులా రాకపోకలకు అవకాశం లేకపోవడంతో వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం 8.30 గంటలకు బస్సు మొరాయించగా 10 గంటల వరకు అదే పరిస్థితి కొనసాగింది. పోలీసులు సైతం అక్కడకు చేరుకోవడంలో జాప్యం జరగడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. అదే సమయంలో ఎండ తీవ్రంగా ఉండడంతో చెమటల్లుకక్కారు. ఇక చేసేదిలేక పలువురు కాకినాడ వైపువెళ్లేవారు ఉండూరు ఏడీబీరోడ్డులోకి, సామర్లకోట వైపు వెళ్లేవారు మాధవపట్నం రైల్వేగేటు ఆటోనగర్ మీదుగా వి.కె.రాయపురం రైల్వేగేటుకు చేరుకుని సామర్లకోట మార్గంలో బయలుదేరారు. గంటల తరబడి ఆర్టీసీ బస్సులు, ప్రయివేటు వాహనాలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు నిలిచిపోవడంతో చంటిపిల్లలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర అసహనానికి గురయ్యారు. కొందరు బస్సులు, ఆటోలు దిగి నడుచుకుంటూ సమీప కూడళ్లకు చేరుకున్నారు.



వాహనాల మధ్యలోంచి నడిచి వెళ్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

తూర్పుపాలెంలో కోకో పార్కు

మలికిపురం: మలికిపురం మండలం తూర్పుపాలెంలో కోకో పార్కు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వపరంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 25 ఎకరాల భూమిని సేకరించడానికి కార్యాచరణ చేపట్టామన్నారు. కోనసీమ జిల్లాలో 1.10 లక్షల ఎకరాల కొబ్బరి తోటలు విస్తరించి సంవత్సరానికి 39 కోట్ల కాయలు ఉత్పత్తవుతున్న క్రమంలో వాటికి సంబంధించి నాలుగు భాగాలతో పది రకాల కొబ్బరి ఉత్పత్తులను తీయొచ్చన్నారు. దీనికి తూర్పుపాలెం అనువైన ప్రాంతంగా గుర్తించి ఇక్కడ కోకో పార్కు ఏర్పాటు చేయడానికి అధికారులతో చర్చించనున్నట్లు వెల్లడించారు.

దీన్నసలు రోడ్డంటారా..?!

కాకినాడ గ్రామీణం మాధవపట్నం రైల్వేగేటు నుంచి భావనారాయణస్వామి ఆలయం మీదుగా కాకినాడ నగరం సర్పవరం కూడలి వరకున్న ఈ దారి దయనీయంగా మారింది. సుమారు 5 కిలోమీటర్ల పొడవున ఉండే ఈ మార్గం పెద్ద గుంతలు, కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా మాధవపట్నం రైల్వేగేటు సమీపంలో ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు హడలిపోతున్నారు. కొంతమంది అదుపుతప్పి పడిపోతున్నారు. మరోవైపు రైలు వచ్చే సమయంలో గేటుపడిన ప్రతిసారీ వాహనదారులు నరకం చూస్తున్నామని వాపోతున్నారు. గుంతల కారణంగా వాహనాలు నిలిచిపోయి విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. అధికారులు సత్వరం స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలంటూ వాహనదారులు కోరుతున్నారు. దీనిగురించి ర.భ.శాఖ ఏఈ లోవరాజును అడుగగా మరమ్మతులకు టెండర్లు పిలిచామని, పనులు చేపడతామని తెలిపారు. **- ఈనాడు, కాకినాడ**



రైల్వే గేటు సమీపంలో..



టైకీ పరిశ్రమ దగ్గరలో ప్రమాదకరంగా గుంతలు..

దళిత యువకుడి హత్యకేసులో.. మాజీ మంత్రి విశ్వరూప్ కుమారుడు అరెస్టు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే: అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అయినవిల్లికి చెందిన వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య(2022 జూన్ 6) కేసులో సూత్రధారైన మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను మదురైలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరువణ్ణామలైలో ఉన్నట్లు తెలియడంతో పోలీసులు అక్కడికి చేరుకోగా శ్రీకాంత్ పరారై మదురై వెళ్లి ఉన్నట్లు సమాచారం. అక్కడ పట్టుకున్నట్లు తెలుస్తోంది. 'నేనో డాక్టర్‌ను... ప్రాణాలు కాపాడుతుంటా గానీ.. తీయడం రాదు.. అక్రమంగా ఇరికిస్తున్నారంటూ' శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, రోడ్డు మార్గంలో ఇక్కడికి తీసుకొస్తున్నారు. ■ ముమ్మిడివరానికి చెందిన వైకాపా నాయకుడు కాశి రామకృష్ణ, మరో ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నిందితులతో ఎక్కువగా ఫోన్లో మాట్లాడినట్లు గుర్తించిన నేపథ్యంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.



అక్రమంగా తనను ఇరికిస్తున్నారంటూ మదురైలో వ్యాఖ్యానిస్తున్న శ్రీకాంత్

నంబరు ప్లేటు.. నచ్చినట్లు రాస్తే కుదరదు!

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నేరవార్తలు

మీ వాహనానికి నంబరు ప్లేటు సరిగా లేకుంటే జరిమానా కట్టాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసు, రవాణా శాఖల అధికారులు స్పష్టం చేస్తున్నారు. పలువురు బోడికలు నంబరు ప్లేటును ఇష్టానుసారం రాయించుకుని వాహనాలు తిప్పేస్తున్నారు. కొందరు అసలు నంబరు ప్లేటు లేకుండా వాహనాలు తిప్పుతున్నారు. 2016 నుంచి షోరూంలలో వాహనాలను కొనుగోలు చేస్తున్న వారు సరిగా ప్రభుత్వం అందజేస్తున్న హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన ఉన్నా చాలామంది అతిక్రమిస్తున్నారు.



ద్విచక్ర వాహనంపై ఎమ్మెల్యేగారి తాలుకా అంటూ..

నంబరు ప్లేట్‌తో ఓ వాహనం చరిత్ర మొత్తం ఇట్టే తెలుసుకోవచ్చు. దీని ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర మోటారు వాహనాల చట్టంలో కొన్ని నిబంధనలు ఉన్నాయి. వాహనం కేటగిరీని బట్టి నంబరు ప్లేటు సైజు మారుతుంది.

వాహనాలకు వేర్వేరుగా..

- రవాణేతర వాహనాలకు నంబరు ప్లేటు తెలుపుపై నలుపు అక్షరాలు ఉండాలి.
- రవాణా వాహనాలకు పసుపు రంగు నంబరు ప్లేటుపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి.
- రిజిస్ట్రేషన్ జరిగే విద్యుత్తు వాహనాలకు ఆకుపచ్చ నంబరు ప్లేటు ఉండాలి.

నంబరులోని అంకెలు, అక్షరాలు మినహా ఏమీ ఉండకూడదు. చాలా వాహనాలకు సినీనటులు, రాజకీయ నాయకుల చిత్రాలు ఉంటున్నాయి. అంకెలు, అక్షరాలను జిగ్ జాగ్‌గా రాస్తున్నారు.



ఓ ఇంటి పేరుతో ఇలా..

జరిమానా ఉంది..

మోటారు వాహనాల చట్టం ప్రకారం.. ఫ్యాన్సీ నంబర్లతో తిరుగుతుంటే రవాణేతర వాహనాలకు రూ.1,150, రవాణా వాహనాలకు రూ.1,300 అపరాధ రుసుం విధిస్తారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే రూ.100 నుంచి రూ.150 వరకు చలానా రాస్తారు. ఇతర ఉల్లంఘనలు ఉంటే అపరాధ రుసుం మరింత పెరుగుతుంది. కేసులు నమోదు చేసే వరకు వెళ్తారు.

నంబరు ప్లేటు సైజు ఎలా ఉండాలంటే.. ● సైజు మిల్లీ మీటర్లలో..

కేటగిరీ	వాహనం ముందు ప్లేటు			వెనుక ప్లేటు		
	పొడవు	మందం	వెడల్పు	పొడవు	మందం	వెడల్పు
ద్విచక్ర వాహనం	30	5	5	35	7	5
మూడు చక్రాల వాహనం	35-40	7	5	35-40	7	5
కార్లు, ఇతర వాహనాలు	65	10	10	65	10	10

గ్రీన్‌ఛానల్‌తో సహకారం.. ఎస్పీకి అభినందనలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడలోని అపోలో ఆసుపత్రిలో ఇటీవల బ్రెయిన్ డెడ్ అయిన ముగ్గురి అవయవాలను విశాఖకు గ్రీన్‌ఛానల్ ద్వారా తరలించేందుకు సహకరించిన ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు వైద్యులు సోమవారం అభినందనలు తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఆసుపత్రి సీఈవో వి.రమణ, సర్జన్ డా.జి.వి.రావు, కన్సల్టెంట్స్ డా. అనిల్‌కుమార్, ఇతర వైద్యుల బృందం ఎస్పీకి జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందించి సత్కరించింది. ఈ సందర్భంలో అపోలో ఆసుపత్రి ట్రాన్స్‌ప్లాంటేషన్ వైద్య బృందాన్ని ఎస్పీ అభినందించారు. పోలీసులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వారిని కోరారు. ఏఎస్పీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, డాక్టర్ ప్రణవ్ నాగేశ్వరరావు, యూరాలజిస్ట్ డా.సీహెచ్ కరుణాకర్‌రెడ్డి, అపోలో డీజీఎం జీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



విక్రాంత్ పాటిల్‌కు జ్ఞాపిక అందిస్తున్న అపోలో వైద్యులు

భావనారాయణస్వామి ఆలయానికి రూ.4.50 లక్షల విరాళం

సర్పవరం (సర్పవరం జంక్షన్): కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు ఏఎమ్ గ్రీన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్ రూ.4.50 లక్షల చెక్కును సోమవారం అందించారు. సంస్థ ప్రతినిధులు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణకు అందించారు. ఆలయ గోశాల, ఇతర అభివృద్ధి పనులకు వినియోగిస్తామని ఈవో తెలిపారు.



చెక్కు అందిస్తున్న ఏఎమ్ గ్రీన్ ఇండియా ప్రతినిధులు

సరకుల నాణ్యతలో జాగ్రత్తలు తీసుకోండి

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం, ప్రసాదం తయారీ, ఇతర వాటికి కొనుగోలు చేసే సరకుల నాణ్యత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కలెక్టర్‌ను ఈవో రామచంద్ర మోహన్ సోమవారం కాకినాడలో కలిశారు. పలు అంశాలపై చర్చించారు. బెల్లంలో సుక్రోజు (తీపి మూలకం) తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆరా తీశారు. బెల్లం కేవలం నిత్యాన్నదానంలో సాంబారు తయారీకి మాత్రమే వినియోగిస్తామని వివరించారు. సత్యదేవుని ప్రసాదం తయారీకి విజయవాడలోని విజయ డెయిరీ నెయ్యి వినియోగిస్తున్నామన్నారు. ఇతర సరకుల నాణ్యత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



మడ అడవులను సందర్శించిన శిక్షణ బృందం

తాళ్లరేవు: కోరంగి అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం, మడ అడవులను తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ అకాడమీ, దూలపల్లి హైదరాబాద్ నుంచి 34మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (ఎఫ్‌బీవో) శిక్షణలో భాగంగా సోమవారం సందర్శించారు. చొల్లంగి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహేష్ మాట్లాడుతూ మడ అడవుల ప్రాముఖ్యతను వివరించారు. పక్షుల శాస్త్రవేత్త దిమ్మల మహేష్‌బాబు మాట్లాడుతూ విదేశాల నుంచి వచ్చే వలస పక్షుల సంరక్షణ అంశాలపై శిక్షణ ఎఫ్‌బీవోలకు అవగాహన కల్పించారు. వారంతా మడ అడవుల్లో సంచరించి, సముద్ర మొగ వరకు బోటు షికారు చేశారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ కుంచే సిద్ధార్థ, బీట్ ఆఫీసర్లు సంధ్యారాణి, ధనలక్ష్మి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై బ్లేడుతో దాడి

తుని: పట్టణంలోని వీరవరపుపేటకు చెందిన ఓ మహిళ తనపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిందని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. బాధిత మహిళ ఇంట్లో ఉండగా అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌బాబు అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడన్నారు. దీంతో ఆమె బ్లేడుతో దాడి చేయడంతో పురుషాంగానికి గాయమవ్వగా పరారయ్యాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీఈవో ఆదేశాలపై ఉద్యోగుల ఆందోళన

గాంధీనగర్, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగులతో 2019లో చేసుకున్న ఒప్పందం మేరకు విడుదలైన జీవో 36 ప్రకారం ఆరేళ్లు గడుస్తున్నా వేతనాలు చెల్లించకుండా, అందులో రాసుకున్న నిబంధనల మేరకు అప్పటి 400 మంది ఉద్యోగుల నియామకాలు చెల్లవంటూ డీసీసీబీ బ్యాంకు సీఈవో ఇచ్చిన సర్క్యులర్‌ను నిరసిస్తూ సహకార ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలోని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటరామయ్య అధ్యక్షతన ఆందోళన కార్యక్రమం జరిగింది. వెంక్రటామయ్య, సహకార సంఘాలకు చెందిన కోనసీమ జిల్లా అధ్యక్షుడు వై.రామచంద్రరావు, తూ.గో. జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల తొలగింపు ఆదేశాలతో సహకార వ్యవస్థ నిర్వీర్యం అవుతుందన్నారు. ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనతోపాటు సమ్మెకు దిగుతామన్నారు. బ్యాంకు సీఈవో నరసింహారావు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఉద్యోగులు నాగమల్లి తోట సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రాజ్‌కుమార్, బలరాం, సత్యనారాయణ, సుధాకర్ వర్మ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



సీఈవోకు వినతిపత్రం ఇస్తున్న సహకారం, బ్యాంకుల ఉద్యోగులు

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపికలు

మసీదుసెంటర్ (కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ జిల్లా ఎంపికలు కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో సోమవారం జరిగాయి. అండర్-14 బాలబాలికలకు టెన్నిస్, అండర్-17 హు-సు బాలబాలికలకు హు-సు, అండర్-14, 17 బాలబాలికలకు సైక్లింగ్ క్రీడల్లో జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి టి.రామ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీలు జి.సునీల్‌కుమార్, కె.పరుశురాం, పీడీలు కె.మంగాయమ్మ, పి.హరిమాలిని, వి.నీలిమ, మస్తాని, ఎన్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారిణి

కల్వరి కార్యకలాపాలు నిలిపివేత

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరంలోని సీబీసీఎన్‌సీ విద్యాసంస్థల ప్రాంగణంలో అనధికారికంగా కల్వరి టెంపుల్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్నారని దాఖలైన ఫిర్యాదుపై కలెక్టర్ షాన్ మోహన్ చర్యలకు ఆదేశించారు. విచారణాధికారిగా కాకినాడ ఆర్డీవో మల్లిబాబును నియమించారు. తక్షణం సీబీసీఎన్‌సీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కల్వరి టెంపుల్‌ను మూసివేసి, నివేదిక ఇవ్వాలన్నారు. దీంతో సోమవారం ఆర్డీవో సమక్షంలో కాకినాడ తహసీల్దారు వి.జితేంద్ర, పోలీసు అధికారులు చర్చి ప్రధాన ద్వారానికి తాళాలు వేశారు. హెచ్చరిక బోర్డు తగిలించారు. ఏడాది కిందట హైదరాబాద్‌కు చెందిన క్రైస్తవ సువార్తకుడు సతీశ్‌కుమార్ సీబీసీఎన్‌సీ విద్యాసంస్థలోని కొంత స్థలంలో కల్వరి టెంపుల్ పేరుతో చర్చి నిర్మాణానికి పూనుకున్నారు. దానికి అనుమతుల్లేవని టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రాథమిక దశలో పనులు నిలిపివేశారు. గత ప్రభుత్వంలో పెద్దల సహకారంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి నిర్మాణం పూర్తిచేసి కార్యకలాపాలు సాగిస్తున్నారు. డిజిటల్ సువార్త పేరుతో పరిచర్య అందిస్తున్నారు. సీబీసీఎన్‌సీ విద్యాసంస్థ ప్రాంగణంలో అనధికార కట్టడాలు నిర్మించవద్దని క్రైస్తవ సంఘాలు అనేక సార్లు ఆందోళనలు నిర్వహించాయి. ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కలెక్టర్ స్పందించి చర్యలకు ఆదేశించారు.



ప్రధాన ద్వారం మూసివేసి, బోర్డు తగిలించిన అధికారులు

అక్రమ తవ్వకాలపై కేసు

గండేపల్లి, న్యూస్‌టుడే: గండేపల్లి మండలం సూరంపాలెం (రామేశ్వరం పేట) మెట్టపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగరాజు, మైనింగ్ అధికారులు తెలిపిన వివరాలివీ.. రామేశ్వరంపేట మెట్టపై అక్రమ గ్రావెల్ తవ్వకాలపై అందిన ఫిర్యాదుపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటలకు చేసిన దాడిలో 228బై3లో అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న రెండు జేసీబీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వ్యక్తి 445 క్యూబిక్ మీటర్ల వరకు అక్రమంగా తవ్వినట్లు వీఆర్వో సూర్యారావు నిర్ధారించారు. దానిపై మైనింగ్ 26-2-1 ఏపీఎమ్ఎమ్ 1966 నిబంధన ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహసీల్దారు విజయ్‌కుమార్, మైనింగ్ టెక్నికల్ అధికారులు రవీంద్ర, తేజ, డిప్యూటీ తహసీల్దారు దివ్యభారతి, సిబ్బంది పాల్గొన్నారు.



రామేశ్వరంపేట మెట్ట వద్ద వివిధ విభాగాల అధికారులు

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

మసీదు సెంటర్(కాకినాడ): 108 ఉద్యోగులకు రెండు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ యాజమాన్యం నాలుగేళ్ల బకాయిపెట్టిన ఇంక్రిమెంట్లు ప్రతి ఉద్యోగికి 40 శాతం తక్షణమే చెల్లించాలని ఉద్యోగులు తెలిపారు. దీనిపై సోమవారం 108 ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరసింహానాయక్, ఎన్టీఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, అరబిందో ఎమర్జన్సీ మెడికల్ సర్వీసెస్ జిల్లా మేనేజర్ అవినాష్‌కు వినతిపత్రాలు అందజేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, జిల్లా కార్యదర్శి జయరాం మాట్లాడారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, జిల్లా కోశాధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకకు బయలుదేరితే మృత్యువు ఎదురైంది..

ఆర్టీసీ బస్సు ఢీకొని దంపతుల దుర్మరణం

నిడదవోలు, న్యూస్‌టుడే: బంధువుల ఇంట్లో జరిగే ఊయల వేడుకకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన దంపతులను మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి తణుకు మండలం పైడిపర్రుకు చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు(60), భార్య దుర్గ(50) తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరులో బంధువుల ఇంట జరుగుతున్న వేడుకకు సోమవారం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నిడదవోలు మండలం గోపవరం కాటా సెంటర్‌కు వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం(వయా నిడదవోలు) వెళుతున్న నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్ వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో వారిద్దరు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు సామాజిక ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరిగాయి.



వెంకటేశ్వరరావు, దుర్గ (పాతచిత్రం)

రాక కోసం ఎదురు చూస్తుంటే..

వెంకటేశ్వరరావు, దుర్గ డి.ముప్పవరం వరకు వచ్చేశారని, మరో పది నిమిషాల్లో వేడుక వద్దకు చేరుకుంటారని సమాచారం అందడంతో వారి రాక కోసం బంధువులు ఆశగా ఎదురు చూస్తుండగా ప్రమాద సమాచారం తెలియడంతో విషాదంలో మునిగిపోయారు. బంధువులతో సందడిగా సాగాల్సిన వేడుక కాస్త విషాదమయంగా మారింది. బంధువులు హుటాహుటీన ప్రమాద స్థలానికి చేరుకునే సరికి వెంకటేశ్వరరావు దంపతులు రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంకటేశ్వరరావు బంటా మేస్త్రీగా పని చేస్తున్నాడు. రోజువారీ కూలి పనులకు కూలీలను తీసుకెళ్తుంటారు. దుర్గ గృహిణి. అమ్మా, నాన్న లేవండి అంటూ వారి మృతదేహాలు ఉన్న అంబులెన్స్ అద్దాల బయట నుంచి చూస్తూ గొంతెత్తి పిలవడం ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.

16 మంది మృతికి కారణమైన డ్రైవర్, క్లీనర్‌కు జైలు, జరిమానా

గండేపల్లి: ఎట్టకేలకు 9 ఏళ్ల తర్వాత లారీ బోల్తాపడిన ప్రమాదంలో 16మంది మృతికి కారణమైన డ్రైవర్, క్లీనర్‌లకు శిక్ష పడింది. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ.. 13 సెప్టెంబరు 2015న అర్ధరాత్రి రాజమహేంద్రవరం నుంచి జగ్గంపేట వైపు వస్తున్న సిమెంట్ బూడిద లారీపై ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి మండలాలకు చెందిన 34 మంది కూలీలు స్వగ్రామాలకు వెళ్లేందుకు లారీ ఎక్కారు. వీరు పశ్చిమగోదావరి చింతలపూడి గ్రామంలో జామాయిల్ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో లారీ ఎక్కగా లారీ గండేపల్లి శివారు ఎన్‌హెచ్‌పై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది కూలీలు సిమెంట్ బూడిదలో ఇరుక్కుని మృతి చెందగా 10 మందికి గాయాలయ్యాయి. మరికొందరు లారీపై నుంచి దూకేయడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో అప్పటి ఎస్సై బి.వి.రమణ 304, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పెద్దాపురం జడ్జి దీప దైవకృప 76 మంది సాక్షులను విచారించిన అనంతరం లారీ డ్రైవర్ జోగా శ్రీను(41). 304, 338, 337, 134 తదితర సెక్షన్ల కింద పన్నెండున్నర ఏళ్ల జైలు, రూ.12 వేలు జరిమానా, క్లీనర్ బొట్టా లోవరాజుకు ఆర్నెల్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించారు. కేసు దర్యాప్తు చేసిన అప్పటి డీఎస్పీ రాజశేఖర్‌రావు, ప్రస్తుత డీఎస్పీ హరిరాజు, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ను, గండేపల్లి ఎస్సై శివనాగబాబును జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.ల్లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

వర్షానికి అరటిని రక్షించుకుందాం

న్యూస్‌టుడే, ఆత్రేయపురం



విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాణిజ్యపంటల్లో ముఖ్యమైన అరటి పంటలో నీరు నిలిచి నష్టం వాటిల్లుతోంది. తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తోట ఆరోగ్యకరంగా ఉంటుందని ఉద్యాన శాఖాధికారి కోటేశ్వరరావు సూచించారు.

ప్రశ్న సమాధానం

ప్రశ్న: అరటిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో పంట రాణింపు ఉండటం లేదు. ఊట ఎక్కి వడిలిపోతున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోవాలి.

-త్రిమూర్తులు, రైతు, ఉచ్చిలి

సమాధానం: నీరు అధికంగా ఉన్న తోటల్లో సిగటోకా, దుంపకుళ్లు వంటి తెగుళ్లు ఆశిస్తాయి. బ్లీచింగ్ పౌడర్ 25 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. ముందుగా నీరు బయటకు పోయేటట్లు చూసుకోవాలి.

ప్రశ్న: తుపాను సమయంలో అరటిని ఎలా కాపాడుకోవాలి.

- సూర్య ప్రకాశరావు, రైతు, రాజవరం

సమాధానం: అధిక గాలుల నుంచి రక్షణకు వెదురు బొంగులు పాతి ఊతం ఇవ్వాలి. పక్వానికి వచ్చిన గెలలు కోసి విక్రయించుకుంటే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. మూడు నుంచి నాలుగు మాసాల మొక్కల మొదళ్లకు మట్టి ఎగదోస్తే బలంగా పెరిగి గాలులకు తట్టుకుంటుంది.



అరటిలో నిల్వ ఉన్న వర్షపునీరు

అంతర పంటలతో అదనపు రాబడి

నాలుగేళ్లపాటు ప్రభుత్వ రాయితీలు

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం: ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై రాయితీలు ప్రకటించి ప్రోత్సహిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. పామాయిల్ మొక్కలు నాటిన దగ్గర నుంచి నాలుగేళ్ల పాటు దిగుబడి రావడానికి సమయం పడుతుంది. ఈ నాలుగేళ్లలో రైతులు అంతర పంటలు వేసి ఆదాయాన్ని పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి సూచిస్తున్నారు.

వేసే విధానం: పామాయిల్ మొక్కల మధ్య అరటి, కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, అపరాలు వేసుకోవచ్చు. మొక్కలు నాటి ఏడేళ్లు దాటితే కోకో, వక్క, అల్లం, పసుపు ఇలా నీడన పండే పంటలు వేయొచ్చు. అంతర పంటల ద్వారా ఎకరాకు రూ.పదివేల వరకు ఆదాయం వస్తుంది. మినుము, పెసర ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా క్వింటా రూ.రెండు వేలు పైబడి అమ్ముతున్నారు. అరటి, కూరగాయలు, పత్తి, మొక్కజొన్న ఎకరాకు రూ.10 నుంచి 15 వేల వరకు ఆదాయం.

ఉద్యానశాఖ ద్వారా రాయితీలిలా..

పామాయిల్ పంటలు సాగుచేసే రైతులు వాటిలో అంతర పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. అంతర పంటలు ఏ రకంగా సాగు చేసుకున్నప్పటికీ హెక్టారుకు రూ.5,250 రాయితీగా ఇస్తుంది. ఒక్కొక్క రైతు ఐదు ఎకరాల వరకు రాయితీ పొందవచ్చు. ఈ విధంగా నాలుగేళ్ల రైతులకు రాయితీ ఇస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి తెలిపారు. కోకో అంతర పంటగా వేసుకునే రైతులు మొక్కల వయస్సు ఏడేళ్లు దాటిన వాటిలో అంతర పంటలుగా వేసే కోకో పంటకు హెక్టారుకు రూ.16వేలు రాయితీగా అందుతుంది. మెట్టప్రాంతంలో పామాయిల్ సాగును పెంచేందుకు ప్రభుత్వం వంద శాతం రాయితీపై మొక్కలు ఇస్తున్నారు.



వేలంకలో పామాయిల్ తోటలో అంతర పంటగా అరటి

ఏటా రూ. 50వేల ఆదాయం

మీ కోసం

పామాయిల్‌లో అంతర పంటగా మినుము, పెసర వంటి అపరాలు ఏడాదికి రెండుసార్లు వేస్తున్నాం. ప్రతిపంటకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటా రూ.ఎనిమిది వేల వరకు అమ్ముతున్నాం. పంటకు రూ.30వేల ఆదాయం వస్తుంది. ఆ విధంగా ఏడాదికి రూ. 50 వేల నుంచి రూ.60వేలు ఆదాయం వస్తుంది.

-శెట్టిపల్లి దుర్గాప్రసాద్, సీతారామపురం

రైతేరాజు

దుంప తోటల్లో నీరు నిలిస్తే చేటు

బిక్కవోలు, పెద్దాపురం: కర్రపెండలం దుంప తోటల్లో వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని పెద్దాపురం దుంప పరిశోధనా స్థానం కీటక శాస్త్రవేత్తలు డా.సునీత(అధిపతి), ఉద్యాన శాస్త్రవేత్త డా. జానకి వెల్లడించారు. నీరు 24 గంటల కన్నా ఎక్కువ నిల్వ ఉంటే దుంపకు కుళ్లు వచ్చే అవకాశం ఉంది. దుంప కుళ్లు వస్తే బాగా చివికిన పది కిలోల పశువుల ఎరువులో రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడీ కలిపి వారం రోజులు నిల్వ ఉంచి మొక్క మొదళ్లలో వేసుకుంటే నివారించవచ్చు.



తెలుసుకుందాం..

ఎరువుల వినియోగం: దుంపతోటల్లో అధిక దిగుబడికి, అధిక పిండిశాతం కోసం మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడాలి. ఎకరాకు 40 కిలోలు వేయాలి. ఈ సమయంలో నత్రజని వాడకం తగ్గించాలి. పంటవేసిన 30, 60, 90 రోజులకు 52 కిలోల యూరియా ఎకరాకు మూడు దఫాలుగా మొక్క ఎదుగుదలకు వేయాలి. వేరు పెరుగుదలకు సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎకరాకు దుక్కిలో 150 కిలోలు తప్పని సరిగా వేసుకోవాలి. కాంప్లెక్సు ఎరువైన 13-0-45ను పదిగ్రాములు లీటరు నీటికి, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

గేదెలు చూలు కట్టే కాలం.. అప్రమత్తత అవసరం

సామర్లకోట గ్రామీణం: ప్రస్తుతం శీతలగాలులు వీచే సమయం కావడంతో గేదెలు చూలు కట్టేందుకు అనుకూలమైన సమయం అని కరప ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ సమయంలో గేదెలతో పాటు యుక్త వయసుకు వచ్చిన పడ్డలు, గొడ్డుమోతు పశువులకు ఖనిజ లవణ మిశ్రమాలను దాణాలో కలిపి ఇవ్వాలి. మొలకెత్తిన పెసలు, సెనగలు వంటి వాటిని నిత్యం దాణాలో పెట్టడం ద్వారా గేదెలు ఎదకు రావడంతో పాటుగా హార్మోన్ల లోపాల సమస్యలు పరిష్కారమై చూలు కట్టే అవకాశం ఉంటుంది. ఎదకు వచ్చిన పశువులను పోతుల వద్ద కాకుండా కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువుల సంతతిని వృద్ధి చేసుకోవచ్చన్నారు..



రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా- 36, వంకాయలు- 42, 44, 48, బెండకాయలు- 44, పచ్చిమిర్చి- 40, 54, కాకరకాయలు- 35, బీర- 45, 20, క్యాబేజీ- 44, క్యారెట్- 40, దొండకాయలు- 22, 28, బంగాళాదుంపలు- 30, 36, ఉల్లి- 45, 50, గోరుచిక్కుళ్లు- 32, దోసకాయలు- 40, ఆనపకాయ- 30, 35, చిక్కుళ్లు- 120, చేమదుంపలు- 30, 40, బీట్‌రూట్- 40, కీరదోస- 24, బీన్స్‌గింజలు- 130, అల్లం- 60, క్యాప్సికం- 100, కూరబొబ్బర్లు- 50, చిలకడదుంపలు- 32, నిమ్మకాయలు(డజన్)- 24, 54, ఒక్కోటి చొప్పున పొట్లకాయ- 20, 25, అరటికాయ- 5, 6, క్యాలీఫ్లవర్- 15, మునగకాడలు- 6, 8, మామిడికాయ- 8, 12.

కాకినాడ

నగరంలో సినిమాలు గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్- విశ్వం, వేట్టయన్ ది హంటర్, విశ్వం, ఇద్దరు, జనక అయితేగనక, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్-ది డీల్, విశ్వం, జిగ్రా, లక్ష్మీ- ఇద్దరు, సత్యగౌరి- లవ్‌రెడ్డి, తిరుమల - వేట్టయన్ ది హంటర్, సీఅండ్‌సీ 1 - జనక అయితేగనక, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ- మార్టిన్, పద్మప్రియ - దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి)- దేవర పార్ట్1, సూర్య 2- వేట్టయన్ ది హంటర్(మ,రా)విశ్వం(ఉ,సా), శ్రీశ్రీనివాసా(వేళంగి)-విశ్వం

విద్యారంగంలో సేవలకు పురస్కారం


సర్టిఫికెట్ అందుకుంటున్న సూర్యనారాయణ

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ అఖిల్ కళాశాల డైరెక్టర్ ఆంధ్ర సూర్యనారాయణకు డా.ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారం లభించింది. కలాం జయంతిని పురస్కరించుకుని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు చేతుల మీదుగా సూర్యనారాయణ ఈ అవార్డు స్వీకరించారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఈ అవార్డు లభించింది. అఖిల్ కళాశాల అధ్యాపకులు ఏజీవీఎస్ ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, కృపానందం, సూర్యమోహన్, గోవిందరావు, శ్రీరామ్ పటాన్, సాయిభార్గవి, చలపతి తదితరులు అభినందించారు.

బోగస్ ఓట్లతో ఎన్నికలు జరపొద్దు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బోగస్ ఓట్లతో వాలు తిమ్మాపురం మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు జరపొద్దని పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం గ్రామప్రజలు, అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సంఘ ప్రత్యేక అధికారి కొత్తగా ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా తయారు చేస్తున్నారని, దీనిలో బోగస్ పేర్లున్నాయని ఆరోపించారు. మరణించిన ఇద్దరి పేర్లు జాబితాలో చేర్చారని, కేవలం ఎస్సీవర్గానికి చెందిన ఓటర్లు మాత్రమే ఉన్న ఈ సంఘంలోకి కల్లుగీత కార్మికులను సభ్యులుగా చేర్చి, తప్పుడు నివేదిక తయారు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అప్పటివరకు వాలుతిమ్మాపురం మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు.

రామారావుపేట.. సమస్యలే అంతటా..

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్, సాంబమూర్తినగర్

ఆకర్షణీయ నగరం కాకినాడ నగర నడిబొడ్డున 40, 41 డివిజన్లలో విస్తరించి ఉన్న రామారావుపేటలో సుమారు 15 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. అధిక సంఖ్యలో అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాలు, రైల్వేస్టేషన్, హోటళ్లు, వివేకానంద పార్కు, ప్రముఖ దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటివి ఈ ప్రాంతంలో ఉన్నాయి. అలాంటి ప్రాధాన్యం సంతరించుకున్న రామారావుపేటలో ప్రజలను సమస్యలు వెంటాడుతున్నాయి. రహదారులపై గుంతలు, విద్యుత్తు స్తంభాల వద్ద ప్రమాదకరంగా తీగలు, రహదారుల పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి, కాలువల్లో మురుగు పారక ఇబ్బందిగా మారాయి.

దారులు అధ్వానంగా..

స్థానిక శివాలయం సమీప కూడలి వద్ద రహదారిపై గుంతలతో ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయపడ్డారు. కొన్ని నెలలుగా ఈ కూడలి గుంతలతో ఉంది. టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో రహదారిపై ప్రమాదకరంగా గుంత ఉంది. స్థానికులు అప్రమత్తం చేసేలా ఓ కర్రను ఉంచారు. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై గుంత ఉండటంతో వాహనదారులు వాపోతున్నారు. పలు విద్యుత్తు స్తంభాల వద్ద వైర్లు వేలాడుతూ ఉన్నాయి. ఆయా విభాగాల అధికారులను అడుగగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


శివాలయం సమీప కూడలి వద్ద దారి తీరు


టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో గుంత


ఓ కూడలి వద్ద విద్యుత్తు స్తంభానికి ప్రమాదకరంగా ఫ్యూజు తీగలు

ఉద్యోగులుగా గుర్తించాలని విన్నపం

కాకినాడ కలెక్టరేట్: ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో 17 ఏళ్లుగా పనిచేస్తున్న వివిధ క్యాడర్ల సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమ్మడి జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు వీరభద్రరావు మాట్లాడుతూ సేవలను పరిగణనలోకి తీసుకుని క్యాడర్ కల్పించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. యామన కృష్ణ, వై.కిషోర్, కె.నాగమణి, కె.అనిల్‌కుమార్, కొప్పిశెట్టి బుజ్జి, బి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ తక్షణం ప్రకటించాలి

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: దీపావళి కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయ పింఛనర్లకు 12వ వేతన సవరణ రిపోర్టు(పీఆర్‌సీ) వచ్చేలోగా 30 శాతం తాత్కాలిక ఐఆర్ మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతాడ ప్రదీప్‌కుమార్, బండి నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల ఏడుకొండలు ప్రభుత్వాన్ని సోమవారం కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటో తేదీన జీతాలు వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

అధికారుల బదిలీకి డిమాండ్

గాంధీనగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా కాకినాడ రైతుబజార్ అధికారుల బదిలీ జరక్కపోవడం వల్ల వర్గ పెత్తందారీ పోకడలు పెరిగిపోతున్నాయని, వెంటనే రైతుబజార్ అధికారులను బదిలీ చేయాలని పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఓ ప్రకటనలో సోమవారం డిమాండ్ చేశారు.

ఎంపిక పోటీలు

సాంబమూర్తినగర్, మసీదు సెంటర్: అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న తైక్వాండో ఇంటర్ కాలేజియేట్ కమ్ టీమ్ సెలక్షన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్, కెప్టెన్ డా.జి.ప్రమీలరాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందని పీడీ తెలిపారు. ✦ కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో మంగళవారం అండర్-17, 19 బాలబాలికల టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలున్నాయి. ఆ మేరకు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి లంకా జార్జి సోమవారం తెలిపారు. క్రీడాకారులు గమనించి హాజరుకావాలన్నారు.

జనరిక్ మందులు ప్రజలకు చేరువ చేయండి

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధ ప్రయోజన ఔట్‌లెట్లు జనరల్ మందుల దుకాణాలను ప్రజలకు చేరువ చేయాలని ఆర్‌సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. వైద్యులు జనరిక్ మందులనే సిఫార్సు చేయాలన్న 2002 ఇండియన్ మెడికల్ కౌన్సిల్ రెగ్యులేషన్ చట్టం అమలుచేసి బ్రాండెడ్ పేరుతో కార్పొరేట్ ఫార్మా కంపెనీల దోపిడీని అరికట్టాలని కోరింది. సోమవారం జ్యోతులమార్కెట్ వద్ద ఆర్‌సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి రంబాల సతీష్ మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో జనరిక్ మందులు లభ్యమయ్యే షాపుల వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. శివకోటి, ఎం.నాగమణి, మంగ, పద్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సతీష్

చరవాణి అప్పగింత

సాంబమూర్తినగర్: రైలులో మరిచిపోయిన చరవాణిని సంబంధిత ప్రయాణికుడికి రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) సిబ్బంది అప్పగించారు. ఆర్పీఎఫ్ సీఐ కొండయ్య వివరాల ప్రకారం.. కాకినాడ నాగమల్లితోట ప్రాంతానికి చెందిన పి.సత్యబరలాల్ సికింద్రాబాద్-కాకినాడ రైల్‌లో ప్రయాణిస్తూ సోమవారం చరవాణి మరిచిపోయి కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌లో దిగి వెళ్లిపోయారు. ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌కు దొరికింది. ప్రయాణికుడికి అప్పగించగా ధన్యవాదాలు తెలిపారు.

సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలి


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు


విజేతలతో నారాయణ పాఠశాలల ఏజీఎం రాఘవేంద్రరావు తదితరులు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటూ సరికొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు ముందుకు సాగాలని కాకినాడలోని నారాయణ పాఠశాలల ఏజీఎం కె.రాఘవేంద్రరావు సూచించారు. స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని నారాయణ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీల్లో బి.రేష్మలక్ష్మీప్రియ(9వ తరగతి) ప్రథమ, ఎస్.సూర్యసాహితి(10వ తరగతి) ద్వితీయ, జీపీ సాయిశ్రీ వైశాలి(8వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. ఇంటర్నెట్ వినియోగంతో మంచి, చెడు ప్రభావం సమాజంపై ఉన్నాయని, సరైన మార్గంలో వినియోగించాలని రాఘవేంద్రరావు అన్నారు. అనంతరం ఏజీఎం చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ కె.కవిత, అకడమిక్ డీన్ బి.హారిక, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి శామ్యూల్ సందీప్ విజేతలను అభినందించారు.

జీవనాధారం తొలగిస్తున్నారంటూ ఫిర్యాదు


వినతి పత్రం చూపుతున్న మాసాబత్తుల సత్యవతి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రామచంద్రపురం నియోజకవర్గంలోని ఆర్యవటం గ్రామానికి చెందిన మాసాబత్తుల సత్యవతి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను ఆర్యవటంలోని కోళ్లసెంటర్ వద్ద కాలువగట్టు చెంతన పాక వేసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, పాక తొలగించాలని పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇచ్చారని వాపోయారు. షెడ్లు వేసుకున్నవారిని వదిలేసి కక్షపూరితంగా తనకే నోటీసు ఇప్పించారని ఆరోపించారు. తన భర్త 30 ఏళ్ల కిందట మరణించాడని, ఇద్దరు పిల్లలు వేరుగా ఉంటున్నారని, తాను ఒంటరిగా ఉంటూ చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నానని తెలిపారు. ఇప్పటికే కిడ్నీ సమస్యతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్నానని చెప్పారు. రామచంద్రపురం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి బాధ్యత మరొకరికి అప్పగించడం అన్యాయమని తాను ఓ కార్యకర్తగా మీడియాలో మాట్లాడడంతో కక్షగట్టి మంత్రి సుభాష్ తండ్రి తన పూరిపాకను కాలువ గట్టునుంచి తొలగించాలని అధికారులతో ఒత్తిడి చేయిస్తున్నారని ఆరోపించారు. తనను వేధించడం దారుణమని వాపోయారు.

కదలలేనండీ.. కనికరించండి



కాకినాడలోని జగన్నాథపురం గోలీపేటకు చెందిన ఇతని పేరు ముమ్మసాని సూరిబాబు. అయిదేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో ఇతని రెండు కాళ్లూ చచ్చుబడిపోయాయి. ఏ పనీ చేయలేని స్థితిలో నిరాశ్రయుడిగా ఉన్న తనను ఆదుకోవాలని గత వైకాపా పాలనలో అధికారులను వేడుకున్నా.. ప్రయోజనం లేకపోయింది. పూట గడవడం కష్టంగా ఉందని.. తనకు రేషన్‌కార్డు, పింఛను మంజూరు చేయాల్సిందిగా అనేక పర్యాయాలు గత పాలకులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. కాకినాడలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అతికష్టం మీద చేరుకొని తన గోడును ఉన్నతాధికారులకు విన్నవించారు. తనను ఆదుకోవాలని సూరిబాబు నీళ్లు నిండిన కళ్లతో అభ్యర్థించారు. – ఈనాడు, కాకినాడ

జనావాసాల చెంత మద్యం దుకాణాలొద్దు


జేసీకి సమస్య వివరిస్తున్న వీరబాబు, భూలక్ష్మి

కాకినాడ కలెక్టరేట్: నగరంలో గుడి, బడికి సమీపంలో, జనావాసాల చెంత మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దని సోమవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనాకు పలు సంఘాల ప్రతినిధులు వినతులు అందజేశారు. కచేరిపేటలోని యూటీఎఫ్ భవనం వద్ద ఏర్పాటుచేసిన దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని ప్రజాసంఘాల తరఫున పలివెల వీరబాబు, ఐద్వా నగర అధ్యక్షురాలు జి.భూలక్ష్మి వినతిపత్రం అందజేశారు. బాలాజీచెరువు కూడలి, టీటీడీ కల్యాణ మండపం వెనుక ప్రాంతంలోని దుకాణాలనూ తరలించాలని మాజీ కార్పొరేటర్, భాజపా నాయకురాలు సాలగ్రామ లక్ష్మీప్రసన్న ఫిర్యాదు చేశారు. డెయిరీ ఫారం కూడలి వద్ద ఇళ్ల మధ్యలో దుకాణం వద్దని తెదేపా నేత తాజుద్దీన్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

మంత్రిని కలిసిన క్రైస్తవ సంఘ ప్రతినిధులు


వినతిపత్రం అందుకున్న సుభాష్

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: కాకినాడకు చెందిన క్రైస్తవ సంఘ నాయకులు సోమవారం మంత్రి సుభాష్‌ను రామచంద్రపురంలో కలిశారు. జాతీయ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం ఆధ్వర్యంలో మంత్రిని కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. కాసరపు సింహాద్రి, టీఎస్ రాజు, ప్రభాకర్, మోజేష్‌కుమార్, పి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

ఎస్.రాయవరం(విశాఖ గ్రామీణం): కాకినాడకు చెందిన షేక్ మహ్మద్ యాసిన్ తన భార్య, కుమారుడు అబ్దుల్ ఖాదర్‌జిలానీ(16)తో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పెదబోదిగల్లంలోని అత్తవారింటికి వచ్చారు. సోమవారం జిలానీ తన తాత ఖాదర్‌బాషాతో కలిసి స్కూటీపై అడ్డురోడ్డు వచ్చి, తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. జిలానీ తలకు తీవ్రగాయం కాగా, ఎడమ కాలుచేయి విరిగిపోయాయి. అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా.. మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.రాయవరం హెచ్‌సీ పవన్ తెలిపారు.

ఆశయాల సాధనకు ఉద్యమిద్దాం

గాంధీనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని 25 ఏళ్ల వయసులో అమరులైన తొరాటి లక్ష్మణమూర్తి, తొలితరం మహిళా ఉద్యమనేత, ఆదర్శ కమ్యూనిస్టు ఇనుగంటి రామతులశమ్మ వర్ధంతిల సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్యభవన్‌లో సోమవారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన అమరుల చిత్రపటాలకు సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జి, కేఎస్ శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎం.వెంకటరమణ, కె.సింహాచలం, కె.వీరబాబు, రమణి, రాజా, రాజ్‌కుమార్, కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించండి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు తమకు గ్రేడ్-1 ఏఎన్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతూ సోమవారం కాకినాడలోని కలెక్టరేట్ వద్ద ఏపీ నేషనల్ హెల్త్‌మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర నాయకురాలు సూర్యకుమారి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న తమకు కూటమి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనాకు వినతి పత్రం అందజేశారు. ఝాన్సీరాణి, దుర్గ, భాగ్యలక్ష్మి, సీత, మరియమ్మ, మాలతి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

హిందీపై అవగాహన కలిగి ఉండాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాయి మనోహర్ తదితరులు

గాంధీనగర్: యూనియన్ బ్యాంకు ఉద్యోగులంతా హిందీపై అవగాహన కలిగి ఉండాలని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ కాకి సాయిమనోహర్ కోరారు. సోమవారం మెయిన్‌రోడ్డులోని రీజినల్ బ్యాంకు కార్యాలయంలో హిందీ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. డిప్యూటీ రీజినల్ హెడ్ నారాయణ, రాజభాష అధికారి రాహుల్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన

సాంబమూర్తినగర్: లక్ష్మీనారాయణనగర్‌లోని నారాయణ పాఠశాలలో ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాటరీ, పాత టీవీలు, ఛార్జర్లు తదితర వస్తువులను పడేయకుండా, ఏ విధంగా ఉపయోగించాలనే అంశాలపై ఏజీఎం రాఘవేంద్రరావు, ప్రిన్సిపల్ కవిత వివరించారు. అకడమిక్ డీన్ హారిక, ఇన్‌ఛార్జి సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ కార్యదర్శిగా సత్యనారాయణ


నూతన కార్యవర్గంతో అసోసియేషన్ సభ్యులు

కాకినాడ కలెక్టరేట్: తూర్పు విద్యుత్తు పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) కాకినాడ డివిజన్ పవర్ డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ కార్యదర్శిగా అసిస్టెంట్ ఇంజినీరు జీవీవీ సత్యనారాయణ(జి.మామిడాడ) ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక రామ్‌కోసా భవనంలో ఏపీ ఈపీడీసీఎల్ ఉమ్మడి జిల్లా సర్కిల్ అసోసియేషన్ కార్యదర్శి పి.రామారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. డివిజనల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.గిరిబాబు(కాకినాడ), డివిజనల్ కోశాధికారిగా ఎం.అలీ(కాకినాడ) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు అభినందించారు. అనంతరం వారంతా కాకినాడ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు జి.ప్రసాద్, కాకినాడ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరు ఎన్.ఉదయ్‌భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వ్యర్థాలు తొలగించారు..



నగరంలోని 41వ డివిజన్ గాంధీనగర్ మల్లయ్య అగ్రహారంలో ఓ దుకాణం వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. చాలా రోజుల నుంచి తరలించడం లేదు. దీనిపై అక్కడి స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యను సంబంధిత నగరపాలక అధికారుల దృష్టికి తీసుకురాగా స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలు తొలగించి సమస్యను పరిష్కరించారు.

వీధి దీపం వెలగడం లేదు..

సమస్య: ఆర్‌ఆర్‌నగర్‌లోని కాపు కల్యాణ మండపం సమీపంలోని 70-17-26/1 డోర్ నంబరు వద్దగల వీధి దీపం కొన్ని రోజులుగా వెలగడం లేదు. **- స్థానికులు, ఆర్‌ఆర్‌నగర్**

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

- సాంబశివరావు, ఏఈ, నగరపాలకసంస్థ

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: **91548 46719**

జిమ్నాస్టిక్స్ క్రీడాకారులకు అభినందనలు


కార్యక్రమంలో డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్ తదితరులు

మసీదు సెంటర్(కాకినాడ): గుంటూరులో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడ డీఎస్ఏకి చెందిన క్రీడాకారులు అన్ని విభాగాల నుంచి మొత్తం 46 పతకాలు సాధించి ప్రతిభ కనబరిచినట్లు డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్ తెలిపారు. సోమవారం డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ హాల్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు, కోచ్ సురేష్‌ను డీఎస్‌డీవో అభినందించారు. సూరత్‌లో జరిగే జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. జిల్లా జిమ్నాస్టిక్స్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చిన్న, కార్యదర్శి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి ప్రజల సమస్యలు


సమస్య తెలుసుకుంటున్న అదనపు కమిషనర్ సుధాకర్

కాకినాడ కలెక్టరేట్: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రికార్డు స్థాయిలో 54 మంది వివిధ సమస్యలను అధికారులకు ఏకరువు పెట్టుకున్నారు. ఈ వారం పారిశుద్ధ్యం, ఆక్రమణలు, రహదారులపై గుంతలు, ఇంటి పన్నులు, మురుగుకాల్వలపై అనధికార దుకాణాలు, వీధి శునకాలు, వీధిదీపాలు వంటి సమస్యలపై వినతులు అందాయి. అదనపు కమిషనర్ సుధాకర్ డయల్ యువర్ కమిషనర్ ద్వారా వినతులు స్వీకరించగా, ఫోనులో గంట వ్యవధిలో 16 మంది వివిధ సమస్యలు విన్నవించారు. అనంతరం స్వయంగా ఆయన వినతులు స్వీకరించగా 38 మంది అర్జీలు అందజేశారు. ఉప కమిషనర్ ఎస్.మనోహర్, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, ఏసీపీ కేవీ నాగశాస్త్రులు, టీపీఆర్వో కె.శైలజ, మేనేజరు శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ, బ్యాడ్మింటన్‌లలో సత్తా


క్రీడాకారులతో కళాశాల ప్రిన్సిపల్, పీడీలు

మసీదు సెంటర్(కాకినాడ): ఇటీవల మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ కబడ్డీ పోటీల్లో కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల కబడ్డీ జట్టు రన్నర్స్‌గా నిలిచిందని ప్రిన్సిపల్ డా.తిరుపాణ్యం తెలిపారు. భీమవరం, డీఎన్ఆర్ కళాశాల్లో జరిగిన ఇంటర్ కాలేజియేట్ పోటీల్లో పీఆర్ కళాశాల బ్యాడ్మింటన్ బాయ్స్ జట్టు నాల్గో స్థానంలో నిలిచిందన్నారు. సోమవారం కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపల్, కోచ్ సాయికుమార్, పీడీలు వర్మ, డా.డీవీ రమణ, దుర్గారావు, శ్రీను తదితరులు అభినందించారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

పంటకాలువ కబ్జా



గ్రావెల్‌తో కప్పేస్తున్న కాలువ

పిఠాపురం, న్యూస్‌టుడే: కోలంక గ్రామంలోని పంటకాలువను ఆక్రమించేశారని స్థానిక రైతులు ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం రైతులు మాట్లాడారు. గ్రామంలో రెండేళ్ల క్రితం కోలంక గ్రామదగ్గర లోని 76 సెంట్ల స్థలంలో లేఅవుట్ వేశారు. అదే సమయంలో ఎల్విన్‌పేట పంచాయతీ పరిధిలోని పరగడద్దికి, దేవుడు మాన్యం స్థలాలకు వెళ్లే పంటకాలువను పూర్తిగా గ్రావెల్‌తో కప్పేసి, రోడ్డుగా నిర్మించారు. నీరుపోయేందుకు ఆ పక్కనే ఓ చిన్నమార్గం ఏర్పాటుచేశారు. ఈ వర్షంలో సమీపంలోని 60 ఎకరాల పంటలకు సాగునీటి మార్గం మూసుకుపోవడంతో రైతులు గతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు పలుమార్లు సర్వేచేసినా ఆక్రమణలు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మళ్లీ తిరుగుతున్నా రాజకీయ ఒత్తిడితో కాలువ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారులు వివరణ కోరగా కాలువ ప్రాంతం గ్రామకంఠంలోనే ఉందని జల వనరుల శాఖ అధికారులు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని వివరించారు.

అధిక సంఖ్యలో సభ్యత్వాలు

పిఠాపురం: నియోజకవర్గంలో ఈ ఏడాది అధిక సంఖ్యలో తెదేపా సభ్యత్వాలు నమోదు చేయిద్దామని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ పిలుపునిచ్చారు. సోమవారం తెదేపా కార్యాలయంలో ఆయన నాయకులతో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి సభ్యత్వాలు ప్రారంభమవుతాయని చెప్పారు. గతంలో 60 వేలకుపైగా సభ్యత్వాలు చేశామని గుర్తుచేశారు. వాట్సప్, టెలిగ్రామ్, మన టీడీపీ యాప్‌ల ద్వారా నమోదు చేయవచ్చని పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

సర్పవరం జంక్షన్: వలసపాకలలోని తెదేపా కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి లబ్ధిదారుకు రూ.4 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గం కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి.. ప్రమాదకరంగా మారి..

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కొత్తపల్లి నుంచి కాకినాడ వెళ్లే పండూరురోడ్డు ప్రమాదకరంగా మారింది. దారిపొడవునా భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న వర్షం కురిసినా గుంతల్లోకి నీరుచేరి అవి ఎక్కడున్నాయో తెలియని పరిస్థితిలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో బస్సులు నడిపేందుకు ఆర్టీసీ డ్రైవర్లు సైతం అంగీకరించడం లేదు. ఒకరోజు నడిపితే వారం రోజులు నిలిపివేస్తున్నారు. దీంతో అటు కాకినాడ వెళ్లే వందల మంది విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. మరోపక్క ఇదే రహదారిలో కొమరగిరి సమీపంలోని ఓ కాలువపై మండలంలోనే అత్యంత ప్రమాదకరంగా మారిన మలుపు వద్ద వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ మలుపు వద్దే పలు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. గతంలో తెదేపా పాలనలో రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరుచేసి శంకుస్థాపన కూడా చేశారు. పనులు జరుగుతుండగా ఎన్నికలొచ్చి వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ అయిదేళ్ల పాలనలో రహదారిలో కనీసం ఒక్క గుంతను కూడా పూడ్చలేదు. ఫలితంగా పనులు నిలిచిపోయి నిధులు వెనక్కి మళ్లాయి.

ఈ విషయంపై రహదారులు, భవనాల శాఖ డీఈఈ నరసయ్యను వివరణ కోరగా రోడ్డు మరమ్మతులకు తాజాగా ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

గుంతలతో తప్పని ఇబ్బందులు

సర్పవరం జంక్షన్: వాకలపూడి గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని యాదవపేట రహదారిలో నడవడానికి సైతం విద్యార్థులు అవస్థలు పడుతున్నారని గ్రామానికి చెందిన నరసింహారావు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా.. పేజీకి ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పల్లెపండగ, పంచాయతీ వారోత్సవాల్లో రూ.80 లక్షలతో అయిదు రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో యాదవపేట రోడ్డు కూడా ఉందన్నారు.



వాకలపూడి యాదవపేట రహదారిలో..



కొత్తపల్లి-పండూరు రోడ్డుపై గుంతలు



కొమరగిరి సమీపంలో ప్రమాదకర మలుపు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నానాజీ

జనవాణిలో అర్జీల స్వీకరణ

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: జనసేన ప్రధాన కార్యాలయంలో జనవాణి కార్యక్రమంలో సోమవారం కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, లీగల్ సెల్ ప్రతినిధులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు

పెద్దాపురం: పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో శ్రీరమణి పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

సర్పవరం (సర్పవరం జంక్షన్): స్వయంభు రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం చేపట్టారు. ఏడు నెలల కాలానికి రూ.3,77,645 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఆస్పత్రి ఎదుటే గుంత



సమస్య: పెద్దాపురం-రాజమహేంద్రవరం ప్రధాన రహదారిలో ప్రభుత్వాసుపత్రి ఎదుట రోడ్డుకు అటు, ఇటు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వాహనాలు పడితే ప్రమాదాలకు గురై ఆసుపత్రిలో చేరాల్సి వస్తోంది. గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకోండి. - రామారావు, పెద్దాపురం

సమాధానం: సిబ్బందిని పంపించి గుంతలు పూడ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. - రాఘవరావు, డీఈఈ, ర.భ.శాఖ, పెద్దాపురం

\- న్యూస్‌టుడే, పెద్దాపురం

పిచ్చిమొక్కల తొలగింపు..

పెద్దాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని సుధాకాలనీలో రహదారిపైకి చొచ్చుకొస్తున్న పిచ్చిమొక్కలను సోమవారం పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఈనెల 21న 'ఈనాడు'లో 'పొడుచుకొస్తున్న పిచ్చిమొక్కలు' శీర్షికన ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. రహదారిపై మొక్కలు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

కరప, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. కరపమండలం పెదకొత్తూరు, వాకాడ గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో ఎం.అనుపమ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెపండగ కార్యక్రమంలో పాల్గొని అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, తెదేపా నియోజకవర్గ కోఆర్డినేటర్ కె.వి.ప్రభాకర్, మండల జనసేన అధ్యక్షుడు బండారు మురళి, మండల తెదేపా అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, ప్రకాష్‌గౌడ్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీవో రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెదకొత్తూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి చిక్కాల తదితరులు



మాధవపట్నంలో పల్లెపండుగలో ఎమ్మెల్యే చినరాజప్ప

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మండలంలోని మాధవపట్నంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, పెద్దాపురం నియోజకవర్గం భాజపా ఇన్‌ఛార్జి విత్తనాల వెంకటరమణ, తెదేపా నేత పెంకే వెంకటేష్, సర్పంచి మేడిశెట్టి సుగుణమ్మ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి భూమిపూజ

పెదపూడి: పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పైన, సంపర, శహపురం, వేంద్ర, కైకవోలు, పెదపూడి, కరకుదురు గ్రామాల్లో పలు రహదారుల అభివృద్ధికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ పల్లెలకు నిధులు కేటాయించి అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడుతోందన్నారు. సంపరలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పెయ్యిదూడల ఉత్పత్తి పథకం, ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, పెదపూడి సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రరెడ్డి, తహసీల్దారు సీతాపతిరావు, కూటమి నాయకులు పుట్టా గంగాధర చౌదరి, జుత్తుక కృష్ణ, తిబిరిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఆకట్టుకున్న పురాతన నాణేల ప్రదర్శన

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం జి.మామిడాడ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడు కె.బాలు సోమవారం ఏర్పాటు చేసిన పురాతన నాణేల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. హెచ్ఎం కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 135 దేశాలకు సంబంధించిన నాణేలు.. భారతదేశానికి సంబంధించి శాతవాహనుల కాలం నుంచి నేటి వరకు ఉన్న నోట్లు, నాణేలను ప్రదర్శనలో పెట్టారు. ఎంఈవో సి.వి.వి.సత్యనారాయణ, సర్పంచి లంకమున్ని, మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పురాతన నాణేలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇసుక, గ్రావెల్ రవాణాకు అనుమతించండి

గొల్లప్రోలు: ఇసుక, గ్రావెల్ రవాణా లేక లారీ రుణ వాయిదాలు సైతం చెల్లించలేని దుస్థితిలో ఉన్నామని, వాటి రవాణాకు అనుమతించాలని పిఠాపురం నియోజకవర్గం క్వారీ లారీ యజమానుల సంఘం ప్రతినిధులు కోరారు. చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు సోమవారం జనవాణి కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ అంశాన్ని పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



జనసేన ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

నకిలీ పత్రాలతో భూమిని కాజేసేయత్నం

కొత్తపల్లి మండలం యండపల్లిలో తన 3.5 ఎకరాల పొలాన్ని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలతో కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని కాకినాడలో ఉంటున్న దాడి శ్రీనివాస్ జనవాణిలో ఫిర్యాదు చేశారు. తాతగారి నుంచి గిఫ్ట్ డీడ్‌గా తనకు సంక్రమించిన ఆ భూమి కౌలుకు ఇచ్చానని, పన్ను సైతం చెల్లిస్తున్నానని ఆయన వివరించారు. జనసేన నాయకుడి సాయంతో భూమిని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే యండపల్లి గ్రామానికి చెందిన మహిళ పంటభూమి వివాదంపై ఫిర్యాదు చేశారు. ఇలా వివిధ అంశాలపై జనసేన జనవాణికి 12 దరఖాస్తులు వచ్చినట్లు సిబ్బంది తెలిపారు.

బోగస్ ఓట్లతో ఎన్నికలు జరపొద్దు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బోగస్ ఓట్లతో వాలుతిమ్మాపురం మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు జరపొద్దని పెద్దాపురం మండలం వాలుతిమ్మాపురం ప్రజలు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వారు నిరసన తెలిపారు. సంఘం ప్రత్యేక అధికారి కొత్తగా ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా తయారుచేస్తున్నారని, దీనిలో బోగస్ పేర్లున్నాయని ఆరోపించారు. ఎస్సీ వర్గాలకు చెందిన ఓటర్లు మాత్రమే ఉన్న సంఘంలోకి కల్లుగీత కార్మికులను సభ్యులుగా చేర్చి, తప్పుడు నివేదిక తయారుచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. అప్పటివరకు ఎన్నికలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందిస్తాం

సామర్లకోట: వీరరాఘవపురంలో విద్యుదాఘాతంతో వరుస రోజుల్లో మృతిచెందిన చిట్టిమాని పద్మ, విశ్వేష్ కుటుంబానికి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని సామర్లకోట విద్యుత్ శాఖ ఏఈ పి.రమేష్ చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో జరిగిన ప్రమాదంపై క్షేత్రస్థాయిలో పరిశీలించామని చెప్పారు. సర్వీసు వైరుకు సంబంధించి ఇంటికి ఏర్పాటుచేసిన ఇనుప గొట్టానికి జీఐ వైరును దుస్తులు ఆరబెట్టుకునేందుకు కట్టారని, దీనికి విద్యుత్ ప్రవాహం జరగడంతో షాక్‌కు గురయ్యారని వివరించారు.

దొరబాబు పరామర్శ..

బాధిత కుటుంబాన్ని పెద్దాపురం నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు సోమవారం పరామర్శించి అండగా ఉంటామన్నారు. రాష్ట్ర అయ్యారక విభాగం అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, పురపాలక సంఘం వైస్‌ఛైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు నేతల హరిబాబు, చిట్టిమాని రాఘవ, సేపేని సురేష్, నాయకులు శ్రీనువాస్ తదితరులు ఉన్నారు.

భాజపా సీనియర్ నేత మృతి

తాళ్లరేవు: పటవల గ్రామానికి చెందిన భాజపా సీనియర్ నేత, రాష్ట్ర ఆక్వా సెల్ అధ్యక్షుడు దాట్ల సత్యవెంకటసుబ్బరాజు (71) ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ మృతిచెందారు. మృతదేహాన్ని సోమవారం గ్రామానికి తరలించారు. సీనియర్ నేతగా పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సేవలందించారు. భాజపా మండల అధ్యక్షుడు దత్తాత్రేయవర్మ, అనకాపల్లి జిల్లా సమన్వయకర్త కర్రి చిట్టిబాబుతో పాటు తెదేపా, జనసేన నేతలు నివాళులర్పించారు. ఆయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

13 గ్రామాలకు బస్సులు రావు!

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో 41 గ్రామాలకుగాను 28 గ్రామాలకు పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండగా 13 గ్రామాలకు బస్సు రాదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై అధిక వ్యయ ప్రయాసలతో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. ఆర్‌బీ పట్నం, కొత్తూరు, సీబీ దేవం, ఆనూరు, కొండపల్లి, ఉలిమేశ్వరం, చదలాడ, తిరుపతి, బి. తాటిపర్తి, సామర్లకోట మండలంలో బోయినపూడి, పి.వేమవరం, కాపవరం, ఉండూరు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. తుని, రావులపాలెం, అమలాపురం, రామచంద్రపురం, రోజోలు ప్రాంతాలకు వెళ్లాలంటే సామర్లకోట, కాకినాడ, పిఠాపురం వెళ్లి బస్సులు ఎక్కాల్సిందే. సుమారు పదేళ్ల క్రితం ఈ ప్రాంతాలకు బస్సులు ఉండేవి. జిల్లాలో 85 డ్రైవర్, 35 కండక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. సామర్లకోట వరకు వస్తున్న పిఠాపురం, రావులపాలెం, రామచంద్రపురం బస్సులను పెద్దాపురం వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మండలాలు	గ్రామాలు	బస్సు సౌకర్యం ఉన్నవి	లేని గ్రామాలు
పెద్దాపురం	23	14	09
సామర్లకోట	18	14	04



పెద్దాపురంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఇటీవల పెద్దాపురం నుంచి సిరివాడ, గుడివాడ మీదుగా కిర్లంపూడి మండలం తామరాడ వరకు బస్సు ఏర్పాటు చేశాం. కాకినాడ నుంచి పెద్దాపురం మీదుగా కట్టమూరు గ్రామానికి సౌకర్యం కల్పించాం. సామర్లకోట వరకు వస్తున్న పిఠాపురం, రామచంద్రపురం, రావులపాలెం బస్సులను పెద్దాపురం వరకు పొడిగించడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

\- మనోహర్, డిపో మేనేజర్, కాకినాడ

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: దోమ కాటు వల్ల వచ్చే డెంగీ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కరప సబ్ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.నాగబాబు అన్నారు. కోరంగి పంచాయతీ సీతారామపురం గుడ్డివానితూము సమీపంలో ఏడు రోజుల కిందట 10 ఏళ్ల బాలుడికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ బాలుడు ఉంటున్న ఇంటిని, పరిసర ప్రాంతాలను నాగబాబు, పంచాయతీ కార్యదర్శి విజేవి రమణ, ఎంపీహెచ్ఈవో బొడ్డు కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రంజన్ సోమవారం ఉదయం పరిశీలించారు. నిల్వ నీటి ప్రదేశాల్లో దోమల లార్వా నివారణకు మందును పిచికారీ చేయించారు. ఏఎన్ఎం రాయుడు సాయి, హెల్త్ అసిస్టెంట్లు కాలా ఆంజనేయులు, కె.నూకరాజు, అభినవ, కె.ఎల్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు ఆర్‌సీఎం చర్చి ఆవరణలో సెయింట్ విన్సెంట్ డి.పాల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పిఠాపురం సీఎంసీ వైద్యులు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. మరో 30 మందికి శస్త్రచికిత్సలు చేయాలని సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో జేమ్స్ భాను, వైద్యాధికారి వెంకటరత్నం, కాకాడ డేవిడ్‌రాజు, ఆసుపత్రి సిబ్బంది, చర్చి యువజన సభ్యులు పాల్గొన్నారు.

రొయ్యలు తరలిస్తున్న లారీ బోల్తా



పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రం సమీపంలో రొయ్యలతో వెళ్తున్న లారీ సోమవారం మధ్యాహ్నం బోల్తా పండింది. కంటైనర్ వాహనంలో తరలిస్తున్న రొయ్యల పెట్టెల్లో కొన్ని రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. తాళ్లరేవు మండలం పటవల నుంచి ఒడిశాకి వెళ్తున్న లారీ పాదగయ క్షేత్రం వద్ద పిఠాపురం నుంచి పెద్దాపురం ద్విచక్రవాహనంపై వెళ్తున్న బి.వీరభద్రస్వామి, నాగమణి దంపతులను ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులను పోలీసులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాద స్థలంలో వాహనాల రాకపోకలు నిలిచిపోగా పోలీసులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువలో దిగిపోయిన బస్సు

సామర్లకోట గ్రామీణం: వి.కె.రాయపురం ప్రధాన రహదారిలో సోమవారం ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు పంట కాలువలోకి దిగిపోయింది. హైదారాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ఈ బస్సు వి.కె.రాయపురం మాధవపట్నం మధ్యలో ట్రాఫిక్ స్తంభించడంతో అందులో చిక్కుకుపోయింది. బస్సును వెనక్కి తీసేందుకు ప్రయత్నిస్తుండగా పంటకాలువలోకి దిగబడింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును అక్కడే నిలిపివేయడంతో ప్రయాణికులంతా సురక్షితంగా బైటపడ్డారు.

అర్చకుల మధ్య వివాదం

కొత్తపల్లి: యు.కొత్తపల్లి మండలం రవీంద్రపురం శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల మధ్య సోమవారం వివాదం నెలకొంది. పూజల నిర్వహణ, ఆవరణలో వైదిక కార్యక్రమాలు ఒకరికి బదులు మరొకరు చేసుకుంటున్నారనే విషయంలో గొడవ రేగింది. వివాదం పోలీసులకు ఫిర్యాదుచేసే వరకు వెళ్లడంతో దేవాదాయ శాఖ పరిధిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్సై వెంకటేష్ వారికి సూచించారు.

బైక్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

పెద్దాపురం: సూరంపాలెం రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రంపం నాగేశ్వరరావు (47) మృతి చెందారు. పెద్దాపురం పోలీసుల సమాచారం ప్రకారం.. తాపీమేస్త్రీగా పనిచేసే నాగేశ్వరరావు గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామం జగనన్నకాలనీలో సొంత ఇల్లు నిర్మించుకుంటున్నారు. రోజూ వచ్చి ఇంటి పనులు చేసుకుని తిరిగి వెళ్లే ఆయన సోమవారం రాత్రి పెద్దాపురం వైపు వెళ్లేందుకు విద్యుత్తు వాహనంపై వస్తున్న ఓ వ్యక్తిని లిఫ్టు అడిగి ఎక్కారు. వెనుక కూర్చున్న ఆయన ప్రమాదవశాత్తు జారిపడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని పెద్దాపురం ఎస్సై మౌనిక పేర్కొన్నారు. ఈయన వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదుచేసినట్లు వివరించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం..

రమణయ్యపేట(సర్పవరం జంక్షన్), న్యూస్‌టుడే: దేశం కోసం బెటాలియన్‌కు చెందిన 16 మంది ప్రాణత్యాగాలు చేసారని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు తెలిపారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద అడిషనల్ కమాండెంట్, అమరవీరుల కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. సహాయ కమాండెంట్ మురళి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం: పట్టణంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ దంతులూరి శ్రీహరిరాజు ప్రారంభించిన ర్యాలీ పురపాలక సంఘం సెంటర్, మెయిన్‌రోడ్డు, వేములవారిసెంటర్, దర్గాపేట, పాశీలవారివీధి, పాతబస్టాండ్, కుమ్మరవీధి, మిరపకాయలవారివీధి మీదుగా పోలీసుస్టేషన్‌కి చేరుకుంది. కార్యక్రమంలో ఎస్సై మౌనిక, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోట: పోలీసు అమరువీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ అన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై మూర్తి, ట్రాఫిక్ ఎస్సై గరగారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

సచివాలయాలను జీపీలకు అనుసంధానం చేయాలి

రౌతులపూడి, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాలను పంచాయతీలకు అనుసంధానం చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో జిల్లా సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, పి.చామవరం సర్పంచి నందమూరి రాజా వినతిపత్రం అందజేశారు. సచివాలయాలు, సిబ్బందిని పంచాయతీ వ్యవస్థకు అనుసంధానం చేయాలని కోరారు. రాష్ట్ర సర్పంచుల సమాఖ్య డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

రౌతులపూడి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వర్‌రావు ఆధ్వర్యంలో పలు సూచనలు చేశారు. వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది, టీపీ, డీఈవో, సహాయకులకు కొనుగోలుపై అవగాహన కల్పించారు.

తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

మూడు దరఖాస్తులు

గండేపల్లి, న్యూస్‌టుడే: గండేపల్లిలో సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికకు మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో నాతి బుజ్జి తెలిపారు. ఉప ఈవో నాయక్, ఏవో గంగాదేవాణి, హౌసింగ్ ఏఈ రాంబాబు, ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

25న గంధోత్సవం

తుని: ఈనెల 25న హజరత్ మహబూబ్ సుభానీ వారి గంధోత్సవం జరుగుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అబ్దుల్ ఖాదర్ జిలానీ వారి దర్గా నిషాని వద్ద శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనల అనంతరం బావుటా ఎగురవేసే కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం మధ్యాహ్నం 14వ వార్డు ముస్లిం వీధి ప్రాంతంలో జెండా నిషాని వద్ద ఖురాన్ పఠనం, ప్రత్యేక ప్రార్థనలు,రాత్రి సహపంక్తి భోజనాలు ఉంటాయి.

పోటీతత్వంతోనే ప్రతిభాపాటవాలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తుని, న్యూస్‌టుడే: అనేక మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో సత్తా చాటి శెభాష్ అనిపించుకున్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) ప్రభావం' అనే అంశంపై సోమవారం శ్రీపై తన్య స్కూల్లో ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. దీనిలో పాల్గొన్న వివిధ తరగతుల విద్యార్థులు తమ ఆలోచనలను స్పష్టంగా వెల్లడించారు. న్యాయ నిర్ణేతలుగా సమాధాన పత్రాలు పరిశీలించిన ఉపాధ్యాయులు విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో సీహెచ్.వినీల్ (9వ తరగతి), పివిఎస్‌డి ప్రణవి (8వ తరగతి), కె.లక్ష్మీ సహస్ర (8వ తరగతి) వరుసగా మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు వైస్ ప్రిన్సిపల్ సీహెచ్‌వివి రామ్మోహన్, ఉపాధ్యాయులు క్రాంతి, ఆర్.జగదీష్, సుభాకర్ చేతుల మీదుగా బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రయాణం.. ప్రాణ సంకటం

అధ్వానంగా అనుసంధాన రోడ్లు

రహదారులపై ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. రోజూ ప్రాణ సంకటంగా ఉన్నా ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో మన్యం రహదారుల పునః నిర్మాణంలో గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఏలేశ్వరం, శంఖవరం మండల పరిధిలోని ఈ రెండు రహదారుల దుస్థితితో 75 వేల మందికి అవస్థలు తప్పడంలేదు. నిధులు ఉన్నా పనులు చేయించడంలో గత పాలకులు విఫలమయ్యారు. మరమ్మతులు లేక రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్ల ప్రస్తుత స్థితి వైకాపా సర్కారు అస్తవ్యస్త పాలనకు అద్దం పడుతోంది. –న్యూస్‌టుడే, ఏలేశ్వరం, శంఖవరం



తూర్పులక్ష్మీపురం వద్ద అడుగుకో గుంతతో రహదారి దుస్థితి

రెండు జిల్లాల ప్రయాణికులకు ఇక్కట్లు

ఏలేశ్వరం మండలం జె.అన్నవరం- రమణయ్యపేట వరకు 13 కి.మీ. ర.భ. శాఖ రహదారి ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ జిల్లాలకు చెందిన వేల మంది ప్రయాణికులకు ఈ రోడ్డే శరణ్యం. అడుగుకో గుంతతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. పెద్ద పెద్ద గుంతల్లో బస్సులు, వ్యాన్లు, భారీ వాహనాలు దిగబడిపోతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులైతే గాయపడుతున్నారు. వైకాపా హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు విడుదలయ్యాయి. అయితే నెల కాలంలో గుత్తేదారు కేవలం రోడ్డుకి ఇరువైపులా కాలువలు తవ్వి వదిలేశారు. తాగునీటి పైపులైను దూరంగా తరలించారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు ఇటువైపు రాలేదు. వర్షాలకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. మండల కేంద్రం ఏలేశ్వరం రావాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని తూర్పులక్ష్మీపురం, రమణయ్యపేట, జె.అన్నవరం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కనీసం ద్విచక్ర వాహనం వెళ్లేందుకు వీలులేని రీతిలో రహదారి దుర్భరంగా ఉంది. ఏజెన్సీ, మైదాన ప్రాంతాలను కలిపే ఈ రహదారి సమస్య నుంచి తమకు మోక్షం కల్పించాలని ప్రజానీకం వాపోతోంది.

మధ్యలో వదిలేశారు..

శంఖవరం మండలం పెదమల్లాపురం రహదారి గిరిజనానికి నిత్యావసరం. జె.కొత్తపల్లి, గౌరంపేట, శృంగధార, వేళంగి తదితర 15 గ్రామాల్లో నివసిస్తున్న 20 వేల మంది జనాభా పెద మల్లాపురం రోడ్డు దుస్థితితో అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పుష్కర కాలం కిందట సగం రహదారిని నిర్మించారు. బిల్లులు మంజూరు కావనే భయంతో అప్పట్లో గుత్తేదారు పనులను నిలిపేశారు. మిగిలిన నిధులు ఏమైపోయాయో జాడే లేదు. సుమారు 23 కి.మీ. పొడవైన ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు.

రోడ్లకు మహర్దశ..

రహదారులను క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలిస్తాం. రోడ్లను చక్కదిద్దాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గతంలో ఏమేరకు నిధులు విడుదలయ్యాయి, వ్యయం ఎంత తదితర వివరాలను కూలంకషంగా పరిశీలిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పెద్దాపురం డివిజన్ పరిధిలోని రహదారులను చక్కదిద్దుతాం. సత్వరం పనులు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

– రాఘవ, డీఈఈ, పెద్దాపురం

త్వరలో అన్న క్యాంటీన్

గండేపల్లి(జగ్గంపేట): రానున్న కాలంలో రోజూ అన్న క్యాంటీన్‌లో పేదల కడుపు నింపుతామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట అన్న క్యాంటీన్ వద్ద సోమవారం భోజనాలు వడ్డన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండేళ్లుగా ప్రతి సోమవారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. భోజనాలకు సహకరించిన గండేపల్లి గ్రామానికి చెందిన ఇవ్వాల సురేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

6 వరకు పట్టభద్రుల ఓట్ల నమోదు

తుని గ్రామీణం: పట్టభద్రుల ఓట్ల నమోదు నవంబరు 6 వరకు గడువు ఉందని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. దరఖాస్తుదారు ఫారం 18 పూర్తిచేసి దానికి డిగ్రీ పత్రం, ఆధార్ కార్డు, ఓటు గుర్తింపు కార్డు నకళ్లతోపాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో జతచేయాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలి

తుని పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను కలిసిన ఆయన సోమవారం ఆయా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్య అభ్యసిస్తున్న అనేక మందిని ఆయా కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి

తుని పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరులకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నివాళి అర్పించారు. సీఐ ఎం.గీతారామకృష్ణ అమరవీరుల స్తూపం నమూనా వద్ద పూలు చల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ.. 1959లో భారత్ - చైనా సరిహద్దు లడాఖ్‌లోని హాట్‌స్ప్రింగ్ వద్ద పహారా కాస్తున్న పది మంది భారత జవాన్లు శత్రుదేశ దాడిలో పోరాడి మృతి చెందారన్నారు. ఆనాటి నుంచి వారిని స్మరిస్తూ ఏటా అక్టోబరు 21న ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా 216 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.



తునిలో నివాళి అర్పిస్తున్న సీఐ, సిబ్బంది

జగ్గంపేట గ్రామీణం: కాట్రావులపల్లి శ్రీవేద పాఠశాల విద్యార్థులు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల కుటుంబాల కోసం సేకరించిన రూ.11వేలు ఆర్థికసాయాన్ని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్‌కు పాఠశాల కరస్పాండెంటు చేతులమీదుగా అందించారు. సీఐ మాట్లాడుతూ.. పిల్లల్లో ఇటువంటి సామాజిక స్పృహ ఉండటాన్ని ఆయన అభినందించారు. దేశం కోసం, సమాజహితం కోసం పోలీసుల త్యాగాలను చిన్నారులకు వివరించారు.

రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

తొండంగి, న్యూస్‌టుడే: పీఈచిన్నాయిపాలెం, రావికంపాడు గ్రామాల్లో రూ.15 లక్షలతో సీసీ రహదారులు నిర్మించనున్నట్లు తెదేపా నాయకుడు యనమల రాజేష్ అన్నారు. పీఈచిన్నాయిపాలెం, రావికంపాడు గ్రామాల్లో సోమవారం జరిగిన 'పల్లెపండగ'లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 'ఉపాధి' నిధులతో మండలంలో రూ.4 కోట్లతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెదేపా నాయకులు నరహరశెట్టి సూర్యప్రకాష్, వడ్డి రాంబాబు, అరిగెల నరసింహమూర్తి, సిద్దా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పీఈచిన్నాయిపాలెం పల్లె పండగలో నాయకులు

ఆర్నెళ్లలో ప్రతి ఇంట్లో కుళాయి

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే : జగ్గంపేటలో ప్రతీ ఇంటికి ఆర్నెళ్ల వ్యవధిలో కుళాయిలు వేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం జగ్గంపేటలో 'పల్లెపండుగ' లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగ్గంపేటలో ప్రతి ఇంటికి తాగు నీటికి ఒక కుళాయి, వాడకపు నీటికి ఒక కుళాయి ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో సచివాలయం-1లో రూ.40 లక్షలు, టవర్‌కాలనీలో సచివాలయం-2లో రూ.1.33 కోట్లు, కాకినాడ రోడ్డు సచివాలయం-3లో రూ.65లక్షలు, సీతానగరంలో సచివాలయంలో-4లో రూ.80 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, రమేష్ తదితరులు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాలకు అన్ని సౌకర్యాలు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. గొల్లలగుంట, సీతానగరంలో సచివాలయం-4 వద్ద సోమవారం పల్లెపండగ నిర్వహించారు. గొల్లలగుంటలో రూ.35లక్షలతో, సీతానగరంలో రూ.70 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రహదారి బాగు చేశారు



శంఖవరం: సీతంపేట గ్రామంలో కాలనీకి వెళ్లే రహదారి తుప్పలతో నిండి ఉందని రహదారి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ వద్ద ప్రస్తావించగా సిబ్బందితో రహదారి బాగు చేయించారు.

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946 ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

పొంచి ఉన్న ప్రమాదం

తుని పట్టణం వీరవరపుపేట నుంచి గవరపేట శివాలయానికి వెళ్లే మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుపక్కనే ఉన్న కాలువను శుభ్రం చేయడానికి కల్వర్టుపై స్లాబు తొలగించి వదిలేశారు. దీంతో రోజూ అనేకమంది పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీసం హెచ్చరిక బోర్డు, బారికేడ్లు అడ్డు పెట్టకుండానే కొన్ని నెలలుగా నిర్లక్ష్యంగా ఇలా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళ చీకట్లో, భారీ వర్షం కురిసినపుడు ఇది కనిపించకపోవడంతో పలువురు పడి గాయపడుతున్నారు. తక్షణం పురపాలక సంఘ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.



గోతిలో పడిన వ్యాను చక్రం



కాలువపై సిమెంట్ స్లాబు ఇలా..

– న్యూస్‌టుడే, తుని

ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

పెద్దాపురం, న్యూస్‌టుడే: సూరంపాలెం రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రంపం నాగేశ్వరరావు (47) మృతి చెందారు. పెద్దాపురం పోలీసుల సమాచారం ప్రకారం.. తాపీమేస్త్రీగా పనిచేసే నాగేశ్వరరావు గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామం జగనన్నకాలనీలో సొంత ఇల్లు నిర్మించుకుంటున్నారు. రోజూ వచ్చి ఇంటి పనులు చేసుకుని తిరిగి వెళ్లే ఆయన సోమవారం రాత్రి పెద్దాపురం వైపు వెళ్లేందుకు విద్యుత్తు వాహనంపై వస్తున్న ఓ వ్యక్తిని లిఫ్టు అడిగి ఎక్కారు. వెనుక కూర్చున్న ఆయన ప్రమాదవశాత్తు జారి పడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందారు. బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామని పెద్దాపురం ఎస్సై మౌనిక పేర్కొన్నారు. ఈయన వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదుచేసినట్లు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి..



తుని, అన్నవరం: తుని రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో అన్నవరం స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై గుర్తుతెలియని వ్యక్తి (40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడని ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదని, తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామన్నారు. వివరాలకు తుని జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

తాగి వాహనం నడిపిన ఏడుగురికి జైలు

గండేపల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు శిక్ష విధించినట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లోలోని నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 13 మందిపై కేసులు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. పెద్దాపురం న్యాయమూర్తి జి.కృష్ణా శేషచార్య ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఏడుగురు వ్యక్తులకు రెండు రోజులపాటు జైలు శిక్ష కూడా విధించారు.

సారా బట్టీలపై దాడులు.. ఒకరి అరెస్టు

కిర్లంపూడి: గెద్దనాపల్లిలో ఏలేరు ప్రధాన కాలువ చెంతన తుప్పల్లో నిర్వహిస్తున్న నాటు సారాబట్టీపై కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. ఒక బట్టీ వద్ద సారా కాసేందుకు నిల్వ చేసిన 500 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసి నిర్వాహకుడు వి.శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 20 లీటర్ల సారా, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి ప్రత్తిపాడు కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

ఆధ్యాత్మిక వైభవం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మినర్వా ఎదురుగా ఉన్న ప్రాంగణంలో నవంబరు 4న జరిగే అయ్యప్ప కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవం కార్యక్రమాలకు తరలి రావాలని గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రత్తిపాడులో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కోటి బిల్వార్చనకు జిల్లాలోని అన్ని అయ్యప్ప పీఠాలకు వెళ్లి నిర్వాహక కమిటీ సభ్యులు ఆహ్వానిస్తున్నారు. ఈ పూజ నిర్వహణకు సంబంధించి మైదానాన్ని తీర్చిదిద్దే పనులు చురుగ్గా సాగుతున్నాయి.



రామచంద్రపురంలో దుర్గమ్మ



రాచపల్లి అరుణాచలేశ్వరునికి పసుపు, కుంకుమతో అభిషేకం

అరుణాచలేశ్వరునికి..

రాచపల్లి శ్రీరమణ సేవాశ్రమంలో వేంచేసి ఉన్న అరుణాచలేశ్వర స్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలను తిలకించారు. అపీత కుచాంబ ఆలయంలో, ఉపాలయాల్లోనూ విశేష పూజలు జరిగాయి. చినశంకర్లపూడిలో కనకదుర్గ ఆలయం వద్ద అన్నదానం జరిగింది.

సత్యదీక్షలు..

ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని పలు గ్రామాల్లో అన్నవరం సత్యదేవుని దీక్షలు స్వీకరించే వారికి దీక్షా వస్త్రాలు అందజేశారు. సత్యదీక్షల ప్రచారకర్త నల్లమిలి రామకృష్ణ ఆలయాల్లోనూ, ఆధ్యాత్మిక సంస్థలకు వెళ్లి దీక్షలు తీసుకునేవారికి పూజావిధానం పుస్తకాలను అందజేశారు. 18 రోజుల దీక్ష తీసుకునే వారు నవంబరు 6 నుంచి, 9 రోజులు చేసే వారు నవంబరు 14 నుంచి మాలధారణ చేయాలన్నారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం వద్ద పలువురికి దీక్షా వస్త్రాలు అందజేసిన కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు సింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ

జగ్గంపేట గ్రామీణం: రామవరంలో సోమవారం ఉదయం 8.25గం.లకు సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. మూడురోజులు ప్రత్యేకహోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద వేదపండితుల మంత్రోచ్ఛరణలు, శిఖరప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, పూర్ణాహుతి, పునఃపూజలు, ఆశీర్వచన, నూతన వస్త్రాలు, మంగళహారతి సమర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, భాజాపా కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, యువమోర్చా నాయకులు వంశీకృష్ణ, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయం వద్ద..

కిర్లంపూడి: రామచంద్రపురంలో కనకదుర్గాదేవి ఆలయం వద్ద దేవీశరన్నవరాత్రుల పూజలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయం వద్ద సోమవారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేనపార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, రామచంద్రపురం సర్పంచి తుమ్మలపలి సాయిగుణశేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఈకార్యక్రమాన్ని చేపట్టారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలకు వినతి

ప్రత్తిపాడు: లంపకలోవ హైస్కూలు ఆవరణలో విగ్రహం ధ్వంసం చేసినవారిపై చర్య తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన పలువురు తహసీల్దారు సూర్యప్రభకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బాధ్యులను శిక్షించాలని కోరారు.

రోడ్డు పన్ను చెల్లించని వాహనాలపై కేసు

రౌతులపూడి, న్యూస్‌టుడే: రౌతులపూడిలో సోమవారం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు (ఎంవీఐ) బి.శ్రీనివాస్ వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు పన్ను చెల్లించని ఏడు వాహనాలను తనిఖీల్లో గుర్తించారు. వాటికి రూ.85 వేలు జరిమానా విధించారు. వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.


శంఖవరం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

శంఖవరం, న్యూస్‌టుడే: శంఖవరం మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా కేళంగి హరినాథ్, ఉపాధ్యక్షుడిగా వెంకట్రావు(బాబీ), కార్యదర్శిగా శివగణేష్, గౌరవ అధ్యక్షుడిగా జక్కల నాగసత్యనారాయణ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాళ్ల మాటున భూ సమస్యలు

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

ఈ రాళ్లు.. అసమగ్ర భూసర్వేకు ఆనవాళ్లు! మెట్టలోని పలు ప్రాంతాల్లో ఇవి కనిపిస్తాయి. వైకాపా పాలకులు ప్రచార ఆర్భాటంగా చెప్పిన పథకానికి నీరసంగా కేటాయింపులు లక్ష్యాన్ని ప్రశ్నించాయి. ఆనక సర్వే లోపాలు వెంటాడాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం మంగళవారం నుంచి గ్రామసభలతో రైతుల చెంతకు వెళ్తోంది. రాళ్ల గుట్టలు వాటిలో కొన్ని గ్రామాలకు సంబంధించినవి! మెట్టలోని ప్రత్తిపాడు మండలంలో 33 గ్రామాల్లో సర్వే పూర్తికాగా 75 శాతం గ్రామాల్లో ప్రక్రియను పూర్తి చేశారు. రీసర్వే తర్వాత హద్దులు మారడం, ఆన్‌లైన్‌లో తప్పుల తడకగా వివరాలు ఉండడం, రైతు భూ విస్తీర్ణం తక్కువగా నమోదవ్వడం వంటి సమస్యలు ఊరూరా ఉన్నాయి. భూ లావాదేవీలు జరిగినపుడల్లా ఈ సమస్యలను రెవెన్యూ కార్యాలయాల్లో ఏకరువు పెడుతున్నారు. గ్రామసభల ద్వారా రీ సర్వే లోపాలను చక్కదిద్దే ప్రయత్నం చేయనున్నారు. మరోపక్క లాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో అంతా సంతోషించగా రీసర్వేను రద్దు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేస్తుండడం గమనార్హం.



ఇ.గోకవరంలో పిచ్చి మొక్కల మధ్యన సర్వే రాళ్లు

పాతని రాళ్లు..

భూ సర్వే చేశాక రాయి పాతితేనే ప్రమాణం. హద్దు నిర్ధారణ చేసినట్లవుతుంది. పాతకుండా వదిలేసిన రాళ్లు ప్రతి మండలంలోనూ గుట్టలుగా ఉన్నాయి. ఈ రాళ్లను కొందరు వేర్వేరు అవసరాలకు పట్టుకెళ్లారు. ఈ రాళ్లను రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి గత ప్రభుత్వం తెప్పించగా పాతడానికి ఒక్కో రాయికి రూ.150లు చొప్పున కూలి ఖర్చు చెల్లించింది. కొన్ని గ్రామాలకు నిధులు ఇవ్వక గుట్టలు మిగిలాయి. వైఎస్సార్ జగనన్న భూరక్ష 2020 పేరుతో ఉన్న ఈ బండల మాటున సవాళ్ల పరిష్కారంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

గ్రామసభలు సత్ఫలితాలివ్వాలి

ప్రత్తిపాడు, తుని గ్రామీణం: మండలంలో భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని రెవెన్యూ యంత్రాంగానికి తహసీల్దారు సూర్యప్రభ సూచించారు. ప్రత్తిపాడులోని తన కార్యాలయంలో వీఆర్‌వోలు, సర్వే సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. మంగళవారం నుంచి జరిగే గ్రామసభలకు ఆయా గ్రామాల రైతులు సర్వే సంబంధ సమస్యలు నివేదిస్తారని, ప్రతి అర్జీని పరిష్కరించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు పుణ్యవతి, మండల సర్వేయర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు. ★ చేపూరు గ్రామంలో భూసమస్యలను పరిష్కరించేందుకు నేడు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ప్రసాద్ తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

శంఖవరం: భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని తహసీల్దార్ పోతురాజు అన్నారు. రాజవరం, గొంది గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి అర్జీలు అందాయని వాటన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.